Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 77 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 ఏప్రిల్ 2023 ఆదివారం పేజీలు : 4

## మళ్లీ మాస్క్ ధరించాల్సిందే...

### పలు రాష్ట్రాల్లో ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలు

న్యూఢిల్లీ: కొవిడ్–19 కేసుల సంఖ్య పెరుగుతుం డటంతో పలు రాష్ట్రాలు మరోసారి బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌ని తప్పనిసరి చేశాయి.గత వారం కొవిడ్ –19 యొక్క నాల్గవ వేవ్ భయం నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా, కేరళ, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు మాస్కు ధరించాలనే ఆదేశాలను తిరిగి తీసుకువచ్చాయి.ఢిల్లీలో మాస్క్ తప్పనిసరి చేస్తూ ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది.నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని డీడీఎంఏ తెలిపింది.కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజధాని లక్నో, ఆరు ఎన్‌సిఆర్ జిల్లాల్లోని బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు ఫేస్ మాస్క్ ధరించడాన్ని తప్పనిసరి చేసింది. హర్యానా ప్రభుత్వం జాతీయ రాజధాని ప్రాంతంలోని నాలుగు జిల్లాల్లో ముఖానికి మాస్క్ ధరించడం తప్పనిసరి చేసింది.

# ఎన్ని శక్తులు ఏకమైనా అభివృద్ధిని అడ్డుకోలేరు

## తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం - ప్రధాని మోదీ



హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో ఉన్నారు. సికింద్రాబాద్–తిరుపతి మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. అనంతరం, పరేడ్ గ్రౌండ్స్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ.. రిమోట్ ద్వారా శంకుస్థాపనలు చేశారు. ఐదు జాతీయ రహదారులకు, బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే, మహబూబ్ నగర్ డబ్లింగ్ పనులను మోదీ ప్రారంభించారు. రూ.11,355 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇక, జెండా ఊపి.. ఎంఎంటీఎస్ రైళ్లను ప్రారంభించారు. అనంతరం, బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రియమైన సోదర సోదరీమణులరా మీ అందరికీ నా హృదయపూర్వక నమస్కారా లు అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలు ఆలస్యమవు తున్నాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు విఘాతం కలిగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో, తెలంగాణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. మేం అభివృద్ధి చేస్తుంటే సొంత పనుల కోసం, కుటుంబ లాభం కోసం కొంత మంది ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి రావడంలేదు. స్వార్థ ప్రయోజనాల కోసమే కొందరి ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. అవినీతి, కుటుంబ పాలన రెండూ ఒక్కటే. తెలంగాణలో కొందరి గుప్పిట్లోనే అధికారం మగ్గుతోంది. తెలంగాణలో కుటుంబ పాలనతో అవినీతి పెరిగింది. ప్రతీ వ్యవస్థలో పెత్తనం చలాయించాలని వారి ప్రయత్నం జరుగుతోంది. కొందురు వారి స్వలాభం మాత్రమే చూసుకుంటున్నారు. అవినీతపరులకు వ్యతిరేకంగా పోరాడాల్సిందే. అవినీతిని ముక్తకంఠంతో ఖండించాలి. ఎంతపెద్దవారైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందే. చట్టపరమైన సంస్థల పనిని అడ్డుకోవద్దు. విచారణ సంస్థలను బెదిరిస్తున్నారు. కొంత మంది అవినీతిపరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు వాళ్లకు షాక్ ఇచ్చింది. కుటుంబ పాలన నుంచి విముక్తి కావాలి. నాపై పోరాటానికి అన్ని శక్తులు ఏకమయ్యాయి. తెలంగాణలో ప్రజావ్య తిరేకత మొదలైంది అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇక, అంతుకుముందు.. తెలంగాణలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు.

తెలంగాణ ఏర్పాటులో ప్రతీఒక్కరూ భాగస్వాములయ్యారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. భాగ్యలక్ష్మి టెంపుల్ నుంచి తిరుమల వెంకన్న వరకు ట్రైన్ వేశామన్నారు. తెలంగాణలో అభివృద్ధి ఎలా చేయాలన్నది కేంద్రానికి తెలుసు. రూ.11వేల కోట్లకుపైగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశాం. ఏపీ–తెలంగాణను కలుపుతూ మరో వందేభారత్ రైలును ప్రారంభించాం. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మెట్రో, ఎంఎంటీఎస్ విస్తరించాం. ఎంఎంటీఎస్ విస్తరణ కోసం రూ.600 కోట్లు కేటాయించాం. తెలంగాణను అభివృద్ధి చేసే అవకాశం నాకు దక్కింది. రైల్వేల్లో తెలంగాణకు భారీగా నిధులు కేటాయించాం. తెలంగాణలోనూ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణలో హైవే నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాం. తెలంగాణలో 4 హైవేలైన్లకు శంకుస్థాపన చేశాం. రాష్ట్రంలో 5వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. తొమ్మిదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ఈజ్ ఆఫ్ దూయింగ్‌లో? ముందంజలో ఉన్నాం. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం ఉన్నా భారత్‌లో స్థిరంగా అభివృద్ధి జరుగుతోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాం. ఇదే సమయంలో గత ప్రభుత్వాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులకు నేరుగా నగదు జమ కోసం డిజిటల్ పేమెంట్ వ్యవస్థను ప్రోత్సహించాం. గతంలో ఇది ఎందుకు నిర్వహించలేదు? అని ప్రశ్నించారు.




సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడవనున్న సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని నరేంద్రమోదీ నేడు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చేరుకున్న ప్రధానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్వాగతం పలికారు.



హైదరాబాద్ : ఒక గీతను చెరపకుండా చిన్నది చేయాలంటే ఏమిచేయాలి ? సింపుల్.. దాని పక్కనే మరో పెద్ద గీత గీయాలి.

## కేసీయార్ సక్సెస్ అయ్యారా ?

ఇపుడు కేసీయార్ చేస్తున్నది కూడా అదే. టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయాలంటే ఏమిచేయాలి మరో వివాదాన్ని రాజుకునేట్లు చేయాలి. అప్పుడు కొత్త వివాదం బాగా అంటుకుని మంటలు రాజుకుంటుంది. దాంతో పాత వివాదాన్ని జనాలు తాత్కాలికంగానే అయినా మరచిపోతారు. ఇపుడు కేసీయార్ చేసిందిదే. ఇంతకీ విషయం ఏమిటంటే టీఎస్ పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వం ఎంతగా గబ్బుపట్టిపోయిందో అందరు చూస్తున్నదే. లీకేజీకి కారణమని చెప్పి ఓ పదిమందిని అరెస్టుచేసి విచారణ జరుపుతున్నా సూత్రదారులు మాత్రం ఇంకా తెరమీదకు రాలేదనే గోల అలాగే జరుగుతోంది. బీజేపీ చీఫ్ బండి సంజయ్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అండ్ కో ప్రశ్నపత్రాల లీకేజీకి సూత్రదారి మంత్రి కేటీయార్ అంటు నానా గోలచేస్తున్నారు. కేటీయార్ ను వెంటనే మంత్రివర్గంలో నుండి బర్తరఫ్ చేయాలంటు రాజకీయపార్టీలు నిరుద్యోగులు పరీక్షలు రాసిన వాళ్ళు పెద్ద రచ్చచేస్తున్నారు. ఈ సమస్యలో నుండి బయటపడాలంటే అర్జంటుగా ఇష్యూని డైవర్ట్ చేయటమొకటే కేసీయార్ ముందున్న ఆప్షన్. అందుకనే పదవ తరగతి ప్రశ్నపత్నం లీకేజీకి బాధ్యుడని చెప్పి బండిని అరెస్టుచేసింది.

దాంతో ఏమైంది ? రెండురోజులుగా టీఎస్ పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ అరెస్టులు విచారణ కేటీయార్ బర్తరఫ్ అంశాలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. టీఎస్ పీఎస్సీ బోర్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న బీజేపీ నేతలు క్యాడర్ మొత్తం ఇపుడు బండి రిలీజ్ చుట్టూనే తిరుగుతున్నారు. అంటే రెండురోజులు బీజేపీ నేతలెవరూ టీఎస్ పీఎస్సీ గురించి పట్టించుకోలేనే లేదు. ఇక్కడే కేసీయార్ స్ట్రాటజీ సక్సెస్ అయ్యిందని అర్ధమవుతోంది. అయితే ఇలా ఎంతకాలం డైవర్షన్ పాలిటిక్స్ తో కేసీయార్ నెట్టుకొస్తారు ? అన్నదే కీలకమైన పాయింట్. బండి తదితరులపై పోలీసులు పెట్టిన కేసులు నిలవదని కేసీయార్ కు బాగా తెలుసు. అయినా పోలీసులు కేసు పెట్టారంటేనే డైవర్షన్ పాలిటిక్స్ కోసమే అని అర్ధమవుతోంది.



## కేసీఆర్ దూకుడు ముందు

# మోడీషాలు తేలిపోతున్నారా?

## బిజెపి పెద్దలకు అంతుబట్టని కేసీఆర్ స్ట్రాటజీ!!

హైదరాబాద్ : కొన్ని థ్రిల్లర్ సినిమాల్లో విషయాన్ని ముందు చెప్పరు. సంబంధం లేని సీన్లు తెర మీదకు వస్తాయి. ఆసక్తిని పెంచుతా యి. సినిమా చూస్తున్న ప్రేక్షకుడి అంచనాలకు తగ్గట్లుగా ఉండటం ఒక ఎత్తు అయితే.. మరికొన్ని సందర్భాల్లో మాత్రం అంచనాలకు అందని రీతిలో రివీల్ అవుతుంది. అప్పటి వరకు సంబంధం లేని అంశాలుగా కనిపించే అంశాలు.. చివర్లో ఒక్కసారిగా ఒకదానితో మరొకటి కలిసి.. అసలు విషయం అర్థమయ్యేలా చేస్తుంది. ఈ సం దర్భంగా ప్రేక్షకుడు విపరీతమైన థ్రిల్ కు ఫీల్ అవుతాడు. తెలంగా ణలోనూ అలాంటి పరిస్థితే ఉందన్న మాట వినిపిస్తోంది. కేంద్రంలోని మోడీ సర్కారుకు రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వానికి మధ్య ఏ మాత్రం పొసగని విషయం తెలిసిందే. తమ సత్తా చాటేందుకు నిదానమే ప్రధానం అన్నట్లుగా మోడీ అండ్ కో సాగుతుంటే.. అందుకు భిన్నంగా కేసీఆర్ మాత్రం తన చేతికి వచ్చిన ఏ చిన్న అవకాశాన్ని విడవకుండా దూకుడును ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్ తో రాజకీయ క్రీడ అంత తేలిక కాదన్న భావన మోడీషాల మదిలో నిండుగా ఉంటుందని.. అందుకే.. వారు ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తుంటారన్న మాట వినిపిస్తూ ఉంటుంది. ఈ కారణంతోనే కేసీఆర్ ఎంత దూకుడుగా నిర్ణయాలు తీసుకున్నా.. అందుకు సంబంధం లేని రీతిలో మోడీషాల నిర్ణయాలు ఉన్నాయని చెబుతారు. తాము టార్గెట్ చేసిన రాష్ట్ర ప్రభుత్వాలను ముప్పతిప్పలు పెట్టి.. మూడు చెరువులు నీళ్లు తాగించే వైనాలు ఇప్పటికే చాలానే చూశాం. ఆయనపై దూకుడుగా దూసుకెళ్లిన ఎంతోమంది ఫైర్ బ్రాండ్ లను వారు నిలువరించిన తీరు దేశ ప్రజలు చూసిందే. ఎవరిదాకానో ఎందుకు? పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సంగతే తీసుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల వేళ.. మోడీషా వర్సెస్ మమత మధ్య సాగిన రాజకీయ యుద్ధం ఎంత తీవ్రంగా సాగిందో తెలిసిందే. ఇప్పటి కేసీఆర్ కంటే కూడా దూకుడుగా వ్యవహరించిన దీదీ.. ఆ తర్వాతి కాలంలో కామ్ అయిపోవటం కనిపి స్తుంది. తనది కాని టైం అన్నట్లుగా ఆమె.. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్న ధోరణి కనిపిస్తుంది. అందులో భాగంగా మోడీషాలతో పంచాయితీ పెట్టుకోవటానికి అంత ఆసక్తి చూపకపోవటం కనిపిస్తుంది. అలాంటి మమతకే సినిమా చూపించిన మోడీషాలు.. కేసీఆర్ విషయంలో వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా కొందరు కేసీఆర్ ను మోడీ షాలే ప్లాంట్ చేశారంటూ అర్థం వాదనలను వినిపిస్తున్నారు. ఒకవేళ అదే నిజమైతే.. మోడీని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ రోజువారీగా అంత ఘాటుగా మా టలు అనిపించకుంటారా? ఒకట్రెండు సందర్భాల్లో అనే మాటల్నే మోడీ జీవితాంతం గుర్తుంచుకొని.. సదరు నేత 'సంగతి' చూసే వరకు నిద్రపోని లక్షణం ఉన్న మోడీ.. కేటీఆర్ లాంటి నేత చేత మాటలు అనిపించుకోవటానికి ఇష్టపడతారా? ఇక్కడ అందరిని వేధిస్తున్న సందేహం మంత్రి కేటీఆర్ అంతేసి పెద్ద మాటలు అంటున్నప్పటికి మోడీషాలు మౌనంగా ఉండటం.. తమను అనే మాటల్ని లెక్కలు వేసుకోవటమే తప్పించి.. పెద్దగా రియాక్టు కాకపోవటం వెనుక లెక్కలు వేరుగా ఉన్నాయన్న మాట వినిపిస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టు అవుతారని బలంగా వాదనలు వినిపించినా.. అందుకు భిన్నంగా ఆమెను అరెస్టు చేసేందుకు ఈడీ అంతగా ఆసక్తిని ప్రదర్శించకపోటం.. అదే సమయంలో టెన్త్ పేపర్ లీక్ ఎపిసోడ్ లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడ్ని రిమాండ్ కు పంపిన వైనం చూస్తే.. మోడీషాలు ఆచితూచి ఆడుతుంటే.. కేసీఆర్ మాత్రం విపరీతమైన దూకుడును ప్రదర్శిస్తున్న ధోరణి కనిపించక మానదు. మొత్తంగా చూస్తే.. తెలివైన శత్రువును ఎదుర్కొనే విషయంలో బలమైన ప్రత్యర్థి ఆచితూచి అన్నట్లు వ్యవహరిస్తారు. కేసీఆర్ విషయంలో మోడీషాల అదే సూత్రాన్ని పాటిస్తున్నారని చెబుతున్నారు. థ్రిల్లర్ సినిమాలో మా దిరి.. సంబంధం లేని అంశాలు కొన్ని చోటు చేసుకోవటం (ఉన్నట్లుండి సుఖేశ్ సీన్లోకి రావటం). . చివరకు భారీ సీన్ తెర మీదకు రావటం లాంటిదే త్వరలో తెలంగాణ రాజకీయాల్లో చోటు చేసుకునే వీలుందన్న మాట వినిపిస్తుంది. మరేం జరుగుతుందో కాలమే సరైన సమాధానం ఇవ్వగలదు.

## సంపాదకీయం

# వైఎస్ఆర్ కూతురు షర్మిల రాజకీయం ఏం నేర్చుకుంది?

వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. అప్పటివరకూ రెండు దఫాలుగా తెలుగుదేశం పార్టీ పాలన సాగించిన వేళ చంద్రబాబుపై వ్యతిరేకతను క్యాష్ చేసుకుంటూ రాష్ట్రమంతా పాదయాత్ర చేసి కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చాడు. తన పాలనతో మరోసారి 2009లోనూ గెలిపించి కాంగ్రెస్ ను ఉమ్మడి రాష్ట్రంలో నిలబెట్టాడు. అలాంటి వైఎస్ కు నాడు పీజేఆర్ సహా ఎంతో కాంగ్రెస్ సీనియర్లు మోకాలడ్డారు. వ్యతిరేకంగా ఉన్నారు. అయినా కూడా వైఎస్ఆర్ అందరినీ కలుపుకొని పోయాడు. అసమ్మతి రాజేసిన నేతలను దగ్గరకు తీసుకొని వారికి భరోసా కల్పించాడు. తను సీఎం అయ్యాక కూడా తనను వ్యతిరేకించిన వారికి మంత్రి పదవి ఇచ్చారు. అయితే ఆయన కడుపున వైఎస్ షర్మిలకు ఈ భారీగుణం రాలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా సీపీఎం ఆఫీసుకు వెళ్లి మరీ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో వ్యహరించిన తీరు చూస్తే ఆమె వైఎస్ ను చూసి అసలు రాజకీయం ఏం నేర్చుకుంది అన్న డౌట్ రాక మానదు. ఇదే విషయాన్ని 'తమ్మినేని' కూడా ప్రెస్ మీట్ లోనే బయటపెట్టడం విశేషం. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలుగా తనను తాను ఎక్కువగా ఊహించుకుంటున్న షర్మిల తన తోటి ప్రతిపక్షాల విషయంలో వ్యవహరిస్తున్న తీరు విస్తుగొలిపేలా ఉంది. తానేం చేసినా ఎదురుదెబ్బలే తప్పింది. సానుకూల ఫలితాలు రావటం లేదన్న ఫ్రస్టేషన్ లో ఉన్నారని అర్థమవుతోంది. రాజకీయాల్లో కనీసం పాటించాల్సిన గౌరవ మర్యాదల్ని ఆమె పాటించని వైనం ఇప్పుడు విస్మయానికి గురిచేస్తోంది. బీఆర్ఎస్ సర్కార్ కు వ్యతిరేకంగా గళం విప్పేందుకు వారి తప్పులపై కలిసి పోరాడదామంటూ తెలంగాణ బీజేపీ కాంగ్రెస్ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు షర్మిల పిలుపునిచ్చారు. వారు కుదరదని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వారి వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు మిత్రులను వెతికే ప్రయత్నంలో ఉన్న ఆమె కమ్యూనిస్టులతో మాట్లాడేందుకు సీపీఎం కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పార్టీ రాష్ట్ర బాధ్యుడు తమ్మినేని వీరభద్రంతో భేటీ అయ్యారు. అనంతరం ఆయనతో కలిసి మీడియా ముందుకు వచ్చారు. అక్కడ వరకూ సీన్ బాగానే ఉన్న షర్మిల నోటి నుంచి వచ్చిన మాటలు విస్మయానికి గురిచేశాయి. తమ్మినేని పక్కన ఉండగానే కమ్యూనిస్టులు బీఆర్ఎస్ కు బీటీం అని మేం కాదు అంటూ నోరుపారేసుకుంది షర్మిల. తెరచాటు రాజకీయాలు చేస్తున్నారని.. వారిలా తాము ఏపార్టీకి తెరచాటు రాజకీయాలు చేయలేదని అన్నారు. తన ఎదుటనే.. తనను ఉద్దేశించి షర్మిల చేసిన వ్యాఖ్యలతో తమ్మినేని వీరభద్రం ఒక్కసారిగా అవాక్కయ్యారు. సాధారణంగా మిత్రత్వం కోసం వెళ్లిన పార్టీ నేతలను ఉద్దేశించి ఏ పార్టీ అధినేత విమర్శలు చేయకు. వియ్యం అందుకోవడానికి వెళ్లి కయ్యం పెట్టుకోరు. కలుపుకుపోతారు. గతంలో వైఎస్ఆర్ టీఆర్ఎస్ తో సహా కమ్యూనిస్టులతో పొత్తుకు వెళ్లి అధికారం సాధించారు. ఇప్పుడు మాత్రం షర్మిల గొప్పలకు పోతూ తనను తానే గొప్పగా ఊహించుకుంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఉంటే షర్మిలతో అసలు ఎవరూ కలిసి రారు అన్న ప్రచారం సాగుతోంది.

# ఆనవాళ్లు లేకుండా చేశారు..



మధిర : సాగర్ ఆయకట్టు మధిర బ్రాంచి కెనాల్ పరిధిలోని ఊటుకూరు మేజర్ కాల్వను దాదాపు రెండు కి.మీ. రైతులు పూడ్చివేశారు. దీంతో ఏటా సాగర్ జలాలు పంట పొలాలపైకి వచ్చి నష్టం జరుగుతోంది. వంగవీడు చెరువుకు చేరాల్సిన సాగర్ జలాలు కాలువను పూడ్చివేయటం వల్ల నీరు వృథా అవుతోంది. ఈ కాల్వ పూడ్చివేసిన ప్రాంతం నుంచి సాగర్ నీరు ఒక వైపున పంట పొలాలపైకి ప్రవహిస్తుండగా మరో వైపు నుంచి పొలాల మీదుగా వైరానదిలో చేరి వృథా అవుతోంది. 1978, 79లో ఊటుకూరు మేజర్ కాల్వ నిర్మాణం జరిగింది. మొదట్లో ఈ మేజర్‌కు ఏడాదిలో అడపాదడపా నీరు వచ్చింది. దీనికి ఈ కాల్వ వల్ల ప్రయోజనం లేదని తలచిన రైతులు దాన్ని పూడ్చివేసి ఆనవాళ్లు లేకుండా వ్యవసాయ భూమిలో కలిపేశారు. నాలుగేళ్లుగా సాగర్ జలాలు సమృద్ధిగా వస్తుండటంతో 15వ కి.మీ. నుంచి కాల్వ పూడ్చివేయటం వల్ల నీరు పంట పొలాలపై ప్రవహిస్తోంది. దాదాపు 22 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో పంట నష్టం జరుగుతోంది. సమస్య తీవ్రతను సంబంధిత ఎన్నెస్పీ అధికారుల దృష్టికి పలు సందర్భాలలో లిఖితపూర్వకంగా తెలియజేసినప్పటికి పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోతున్న వారిలో కౌలు రైతులు సైతం ఉన్నారు. ఏటా కబ్జాకు గురైన కాలువను తవ్విస్తామంటూ అధికారులు చెప్పటమే కానీ కార్యరూపం దాల్చటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పలు సందర్భాలలో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రియల్టర్ల కబ్జా ఇలా: మధిర మేజర్ కాల్వ చివరిలో ఉన్న దిడుగుపాడు సమీపంలో కబ్జాకు గురైంది. కొంత కాలువను ఆనవాళ్లు లేకుండా చేసి రియల్టర్లు ప్లాట్లుగా చేసి విక్రయించారు. దీనిపై పలు సందర్భాలలో ఫిర్యాదు చేసినప్పటికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో భూమి ధర ఎకరాకు రూ.50 నుంచి రూ.70 లక్షల వరకు పలుకుతోంది. ఇల్లెందులపాడు – దెందుకూరు మధ్యన ఉన్న ఎన్నెస్పీ కాలువ కట్టను సైతం రియల్టర్లు కబ్జా చేసి విక్రయించటం కొసమెరుపు. ఊటుకూరు మేజర్ దాదాపు 2 కి.మీ. దూరం పూడ్చివేయటం వల్ల రైతులకు ఏటా పంట నష్టం జరుగుతోంది. వర్షాకాలంలో సాగర్ జలాలు వస్తే ఆ నీరు అంతా పంట పొలాలపై ప్రవహిస్తుంది. దీంతో పత్తి, మిరప పైర్లకు నష్టం వాటిల్లుతుంది. సమస్యను పరిష్కరించాలని పలు సందర్భాలలో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. అంతేకాకుండా ఎన్నెస్పీ అధికారుల దృష్టికి లిఖితపూర్వకంగా ఇచ్చాం. అయినప్పటికి పరిష్కారం లభించటం లేదు. వాసిరెడ్డి పుల్లారావు, రైతు

# మొరం... అక్రమార్కులకు వరం



సిరిసిల్ల : జిల్లాలో మొరం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కొందరు అక్రమార్కులు సహజ వనరులను కొల్లగొట్టినా పట్టించుకున్న నాథుడు లేడు. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టలు, ప్రభుత్వ స్థలాల్లో తవ్వకాలు చేసి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొందరు నేతలు, అధికారుల అండదండలతోనే ఈ దందాను సాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ వ్యాపారం సాగిస్తున్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు, రాజీవ్‌నగర్, రగుడు ప్రాంతాలతోపాటు జిల్లాలోని తంగళ్లపల్లి, కోనరావుపేట, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో అధికంగా తవ్వకాలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకున్న పాపానపోలేదు.

అనుమతులు తప్పనిసరిమొరం తవ్వకాలు చేపట్టాలంటే కచ్చితంగా మైనింగ్, అటవీశాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి పన్ను చెల్లించాలి. మొరం ఉన్న ప్రాంతంలో ఎన్ని క్యూబిక్ మీటర్ల వరకు లీజు ఇవ్వాలో రెవెన్యూ అధికారులు నిర్ణయిస్తారు. మైనింగ్ అధికారులు వేబిల్లులు జారీ చేయాలి. మొరం లభ్యతను బట్టి 60 రోజుల వరకు తాత్కాలిక అనుమతులు పొందవచ్చు. తవ్వకాలు జరిపే పరిధిలోని గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా తరలిస్తున్నా అడిగేవారు కరవయ్యారు. మరికొందరు తాత్కాలికంగా అనుమతి తీసుకుని ఏడాదంతా తవ్వకాలు చేస్తుండటం గమనార్హం.

పనుల పేరిట...ప్రభుత్వం చేపడుతున్న పనులకు కూడా గుత్తేదారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మొరం టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. మరికొందరు లేఅవుట్ వెంచర్లలో రోడ్లకు, ఇతర నిర్మాణాల్లో బరంతి కోసం అవసరాలను బట్టి మట్టిని తరలిస్తున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు స్థానిక అవసరాల పేరిట ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

టిప్పర్‌కు రూ. 2 వేల వరకు...టిప్పర్‌తో మొరం సరఫరా చేస్తే దూరాన్ని బట్టి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు తీసుకుంటున్నారు. ట్రాక్టర్‌తో అయితే రూ.400 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. ప్రధానంగా గృహ నిర్మాణాలు అధికంగా సాగే పట్టణాలు, మండల కేంద్రాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. వ్యాపారులు పట్టణ శివారు ప్రాంతాలు, గ్రామాల్లో తవ్వకాలు చేపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టా, అసైన్డ్ భూముల్లో తవ్వకాలు చేపట్టి సరఫరా చేస్తున్నారు. కొత్తగా వెలుస్తున్న వెంచర్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.– సైదులు, ఏడీ, మైనింగ్

సిరిసిల్లజిల్లాలో 9 మందికి మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చాం. నాంపల్లిలో 4, కోనరావుపేటలో 2, జిల్లెల్లలో 1, బోయినపల్లి, విలాసాగర్ గ్రామాల్లో ఒక్కోచోట మాత్రమే అనుమతులు ఇచ్చాం. ఎక్కడైనా అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

# అక్రమ ఇసుక రవాణా ఆగేదెట్లా..!

మెట్‌పల్లి : ఇసుకను అక్రమంగా తరలించేందుకు మాఫియా ఇష్టారాజ్యంగా నడుస్తుంది. ప్రజల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎక్కడపడితే అక్కడ పెద్దపెద్ద గుంతలు తోడి అక్రమ ఇసుక రవాణాను మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు. అధికారుల అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు మాఫియా వివిధ సమయాలను ఎంచుకొని కావాల్సిన చోటుకు ఇసుకను తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న అక్రమ ఇసుకను ఆపిన వారు లేకుండా పోయారు.

గుంతలో పడి బాలుని మృతి

పట్టణ శివారులో వట్టివాగులో ఇసుక కోసం పెద్దపెద్ద గుంతలు తోడి ఇసుకను తరలిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం 8వతరగతి బాలుడు పాఠశాల ముగిసిన తర్వాత సరదగా స్నానం చేసేందుకు వాగులోకి వెళ్లి నీరు ఉన్న దాంట్లో ఒక్కసారిగా దూకాడు. దీంతో అదే గుంతలో సన్నపు ఇసుకలో ఇరుక్కుని మరణించిన సంఘటన అందరికీ తెలిసిందే. ప్రస్తుతం వట్టి వాగులో ఎటు చూసినా ఇసుక కోసం తవ్విన పెద్దపెద్ద గుంతలే దర్శనమిస్తున్నాయి. ఇవతలి వైపు మహాలక్ష్మి ఆలయం వరకు, ప్రధాన రహదారికి అవతలివైపు వాగులో గుంతలు తోడి ఇసుకను తరలిస్తున్నారు. వాగులో తోడిన ఇసుకను పట్టణ శివారుల్లో ఖాళీ స్థలాలను ఎంచుకుని గుట్టలు గుట్టలుగా డంపింగ్ చేస్తూ ఇసుకను నిల్వ చేస్తున్నారు. రోజూ రాత్రి, తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు వివిధ వీధుల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఆయా చోట్లకు తరలిస్తున్నారు.

అక్రమ ఇసుకపై ఎప్పుడైనా వార్తలు వచ్చినప్పుడు ఒక్కసారిగా పోలీసులు, అధికారులు ఆకస్మిక దాడులతో హడావుడి చేయడం రెండు మూడు ట్రాక్టర్లను పట్టుకోవడం పరిపాటిగా మారింది. అధికారులు ట్రాక్టర్లను పట్టుకోగానే ట్రాక్టర్ ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. మళ్లీ ఓ వారం అయిందంటే చాలు ఇసుకపై 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందాన తయారవుతుంది.

తరలింపునకు పాత ట్రాక్టర్లు

చాలా మంది ఇసుక అక్రమ రవాణాకు పాత ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు నెంబర్ కూడా లేకపోవడం విడ్డూరంగా మారింది. దీనికి తోడు ట్రాక్టర్లను నడిపే వారికి కూడా డ్రైవింగ్ లైసెన్స్ గాని ట్రాక్టర్‌కు ఇన్సురెన్సూలు లేకుండా అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం బావుల్లా మారిన వట్టివాగును గుంతలను పూడ్చి మళ్లీ ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై తహసీల్దార్ సత్యనారాయణను వివరణ కోరగా నేను మెట్‌పల్లి వచ్చి కొన్ని రోజులే అవుతుంది. అయినా రెండు నెలల్లో ఇప్పటికే 20కిపైనే ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వట్టివాగులో పలు గుంతలను కూడా పూడ్చామన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని, దొరికిన వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాగులోకి ఎవరు లోనికి వెళ్లకుండా గుంతలు ఉన్న చోట్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

# వేసవి క్రీడాశిబిరాలకు వేళాయే..

ఖమ్మం : సుదీర్ఘ విరామం తర్వాత మే 1వ తేదీ నుంచి ఖమ్మం జిల్లా యువజన క్రీడల శాఖ 14 ఏళ్లలోపు బాలబాలికలకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పది క్రీడాంశాల శిబిరాల ఏర్పాటుకు అనుమతివ్వగా జిల్లా యువజన క్రీడల శాఖ తరఫున 18 శిబిరాలను సిద్ధం చేశారు. మొత్తం 28 శిబిరాలు ఎంపిక చేసిన ప్రాంతాల్లో నెల రోజులపాటు నిర్వహించనున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిదిన్నర వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరున్నర వరకు శిబిరాలను నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు పూర్తయి వేసవి సెలవులు వచ్చిన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తికి అనుగుణంగా క్రీడల్లో శిక్షణ ఇప్పించేందుకు సిద్ధం అవుతున్నారు.

ఖమ్మం పటేల్ స్టేడియంలో సందడే సందడి..ఇక్కడ అథ్లెటిక్స్, వాలీబాల్ తర్ఫీదుకు ప్రభుత్వం నియమించిన అధికారిక సీనియర్ శిక్షకులు ఉన్నారు. వేసవి క్రీడాశిబిరాల కోసం మైదానాలకు వచ్చేవారిలో సహజ ప్రతిభ కల్గిన వారున్నారా? దీర్ఘకాలిక శిక్షణకు అవసరమైన ఎందరున్నారు? అనే కోణంలో ఈ రెండు శిబిరాల్లో శిక్షకులు అన్వేషిస్తున్నారు. వీటితో పాటు ప్రైవేటు శిక్షకులు, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, స్కేటింగ్, స్విమ్మింగ్, లాన్‌టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, విలువిద్య, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, ఊషూ, జిమ్ సాధన, స్క్వాష్, బిలియర్డ్స్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాలు ఉన్నాయి.



ఏ ఆటలు ఎక్కడంటే? అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ శిబిరాలు: కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శిక్షకుడు వీరరాఘవయ్య తర్ఫీదు ఇస్తారు. బ్యాడ్మింటన్: వైరా ఇండోర్ స్టేడియం (అమ్జద్), బోనకల్లులో (ఎ.లింగయ్య). ఖోఖో: మధిర హైస్కూల్ (సైదులు). విలువిద్య: తనికెళ్ల గ్రేస్ జూనియర్ కళాశాల(పి.రవి). ఫుట్‌బాల్: కూసుమంచి మండలం నేలపట్ల ప్రభుత్వ పాఠశాల (ఇర్ఫాన్‌అహ్మద్), వీవీపాలెం (కె.సాయిరాం).

హ్యాండ్‌బాల్, ఖోఖో: పాండురంగాపురం ప్రభుత్వ పాఠశాల (కె.కృష్ణయ్య). కబడ్డీ శిబిరం: ఏన్కూరు మండలం తిమ్మరావుపేట ప్రభుత్వ పాఠశాల (శోభన్‌కుమార్)లో నిర్వహిస్తారు.

గ్రామీణ శిబిరాలు ఉచితం

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడాశిబిరాలకు ప్రభుత్వం తోడ్పాటు ఉంటుంది. ఇక్కడి శిక్షణలు, సదుపాయాలు పూర్తిగా ఉచితం. ఈ శిబిరాలకు అవసరమైన క్రీడాసామగ్రి, నిర్వహణ, శిక్షకుడి భత్యాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చెల్లిస్తుంది. మే 1 నుంచి 31 వరకు క్రీడా శిబిరాలు కొనసాగుతాయి.

నెలవారీ ఫీజులు

ఈత నేర్చుకునే వారికి రూ.1000, రూ.1200 ఫీజు నిర్ణయించారు. మిగిలిన అంశాల్లో జిమ్నాస్టిక్స్ రూ.300, బ్యాడ్మింటన్ వయసును బట్టి రూ.1200, రూ.1000, రూ.600, ఊషూ రూ.300, అథ్లెటిక్స్ రూ.200, వాలీబాల్ రూ.300, మిగిలిన అంశాల్లోనూ రూ.200 నుంచి రూ.500 వరకు నెలవారి ఫీజులు నిర్ణయించారు. నగరంలో నిర్వహించే క్రీడా శిబిరాలన్నింటిలో కొంత ఫీజు తీసుకుంటారు. ఇందులోంచి నిర్వహణ, శిక్షకుడి భత్యం చెల్లించాల్సి ఉంటుంది. దాదాపుగా మూడేళ్లు క్రీడాకార్యకలాపాలన్నీ మూలనపడ్డాయి. చిన్నారులు స్వేచ్ఛగా ఇప్పుడిప్పుడే మైదానాలకు వస్తున్నారు. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. కలెక్టర్ సూచన మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదు. ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి సమస్యలు తలెత్తినా మా దృష్టికి తేవాలి. – డీవైఎస్వో పరంధామరెడ్డి

# కొబ్బరి బోర్డు.. ఆశలు ఫలించేన..!

అశ్వారావుపేట : కొబ్బరి అబివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలనే రైతుల కోరిక ఈ సారైనా నెరవేరుతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల కేంద్ర కొబ్బరి బోర్డు అధికారులు అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించినప్పుడు బోర్డు ఏర్పాటు అంశం తెరమీదకు వచ్చింది. త్వరలోనే అశ్వారావుపేట, దమ్మపేట కేంద్రంగా తెలంగాణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు అంశం పరిశీలనలో ఉన్నట్లు సూచనప్రాయంగా తెలపడంతో రైతుల మోములో ఆశలు చిగురించాయి. ఈ నెల 9న కొబ్బరి అభివృద్ధి మండలి బోర్డు అధికారుల బృందం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించిన విషయం విదితమే. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఇప్పటికీ ఉమ్మడి ఏపీలోని వేగినాడలో ఉంది. గత ఏడాది అక్కడి నుంచి రైతుల ప్రయోజనాలకు ఖర్చు చేయాల్సిన సుమారు రూ.70కోట్లు వృథాగా వెనక్కి వెళ్లాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కొబ్బరి అభివృద్ధి మండలి బోర్డు నుంచి ఒక్క పైసా తెలంగాణ రాష్ట్రానికి ఖర్చు పెట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఇచ్చే రాయితీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మూడేళ్లుగా కొబ్బరి రైతులకు ఎలాంటి రాయితీ పథకాలు అందడం లేదు. కొబ్బరి మొక్కల కోసం వేగివాడకు వెళితే ఏపీ రైతులకు ఇచ్చాకనే తెలంగాణ వారికి అంటున్నారు. దీంతో రైతులు మొక్కల కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు..!కొబ్బరి బోర్డు ఏర్పాటు అయితే ఈ ప్రాంతంలోనే ప్రత్యేక కొబ్బరి విత్తనోత్పత్తి జరుగుతుంది. హైబ్రీడు మొక్కలను తయారు చేస్తారు. వాటిని రైతులకు రాయితీపై సరఫరా చేసేందుకు వీలుంది. ఏటా రైతులకు రాయితీపై మొక్కలు, ఎరువులు అందజేసే అవకాశాలున్నాయి. బోర్డు అందుబాటులో ఉంటే ఏటా కొంత మొత్తంలో రాయితీ నాలుగేళ్లపాటు కొబ్బరి రైతులకు లభిస్తుంది. బోర్డు పర్యవేక్షణలోనే కొబ్బరి కాయల కొనుగోళు సాగుతాయి. ప్రత్యేక నర్సరీ ద్వారా నాణ్యమైన మొక్కల ఉత్పత్తి జరుగుతుంది. హైబ్రీడైజేషన్ (సంకరీకరణ పద్ధతి) ఇక్కడే జరిపే వీలుంది. ఇన్ని విధాలుగా ప్రయోజనాలున్న కొబ్బరి బోర్డు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేటలో 50 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం 1991లో ఏర్పాటైంది. 2005 వరకూ కొబ్బరి విత్తన సంకరీకరణ చేశారు. నిపుణుల కొరతతో సంకరీకరణ (హైబ్రీడైజేషన్) నిలిపివేశారు. వేగివాడలో హైబ్రీడైజేషన్ కొనసాగుతోంది. యావత్తు తెలంగాణ రాష్ట్రంలో అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతంలోనే సుమారు 8000 ఎకరాల్లో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయి.

# వీధి కుక్కల వీరంగం

వరంగల్ : కాలనీల్లో వీధి కుక్కల వీరంగం సృష్టిస్తున్నాయి. నగరంలో రోజూ ఏదో ఒకచోట ప్రజలకు కుక్క కాట్లు తప్పడం లేదు. వరంగల్ కాశీబుగ్గలో ఆరేళ్ల బాలుడిపై దాడి చేసిన ఘటన మరువక ముందే వరంగల్ పాపయ్యపేట కుంటి భద్రయ్యగుడి వద్ద ఐదేళ్ల బాలుడు రాముపై వీధి కుక్క దాడి చేసింది. చేతులు, వెన్నులో ఎనిమిది కాట్లు పడ్డాయి. స్థానికులు చూసి ఉండక పోతే తీవ్ర గాయాలైవి. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ పాపయ్యపేట, రామన్నపేట పెద్దమోరీ, గంగపుత్ర వీధి, రామన్నపేట ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల నివారణ చర్యలు ముమ్మరం చేశామని బల్దియా ప్రజారోగ్య విభాగం అధికారులంటున్నారు. నగరంలోని ఏ వీధిలో చూసిన గుంపు గుంపులుగా గ్రామ సింహాలు కనిపిస్తున్నాయి. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, పాఠశాలలు, కాలనీల్లో అవగాహాన సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకుడు ఉత్తర్వులు జారీ చేసిన గ్రేటర్ వరంగల్ యంత్రాంగం కదలడం లేదు. ఏదైనా ఘటన జరిగితేనే ఆ రోజు మటుకు సీరియస్‌గా తీసుకుంటున్నారు. తర్వాత షరా మాములవుతుంది. నగరంలోని 66 డివిజన్లలో 20వేల పైనే వీధి కుక్కలుంటాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పరిశీలనలో తేలింది.

తాజా ఘటనలు

29వ డివిజన్ పాపయ్యపేట కుంటి భద్రయ్య గుడి వద్ద రాము అనే ఐదేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసింది. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందారు.

వరంగల్ రంగంపేట పోలీసు క్వార్టర్స్ వెనుకల రాములు అనే వృద్ధుడు గాయపడ్డాడు. చేతి, కుడి కాలుపై నాలుగు కాట్లు పడ్డాయి.

40వ డివిజన్ నానమీయతోటలో గృహిణి గాయపడింది. చేతిపై రెండు కాట్లు పడటంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

హనుమకొండ పద్మాక్షి కాలనీలో నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడి కుక్కలు వెంబడించాయి. భయంతో వాహనం అదుపుతప్పి కింద పడటంతో చేతికి గాయమైంది.

మామునూరు, బొల్లికుంట, భట్టుపల్లి, గొర్రెకుంట, ఆరెపల్లి విలీన గ్రామాల్లో స్థానిక ప్రజలు గాయపడ్డారు.

ప్రతిరోజూ ఎంజీఎం ఆసుపత్రికి 10-15 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారని తెలిసింది.

ములుగురోడ్డు: 22వ డివిజన్ బ్యాంక్‌కాలనీలో ఒకటో తరగతి చదువుతున్న ఆరు సంవత్సరాల జశ్వంత్ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. పక్కన ఓ ఇంటి వద్ద ఇద్దరు మహిళలు మాట్లాడుకుంటూ ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న వీధిలో ఓ పక్క నుంచి మెల్లగా నడుచుకుంటూ వచ్చిన వీధి కుక్క ఒక్కసారిగా బాలుడి పై దాడి చేసింది. పక్కనే ఉన్న ఓ మహిళ తన చీర కొంగుతో కుక్కను అదరగొట్టింది. కుడి భుజం పై జశ్వంత్‌కు గాయాలు అయ్యాయి. దేశాయిపేటరోడ్‌లో కూతటి రఘుపై కుక్క దాడిచేయడంతో కాలుకుగాయమైంది.

కోతుల స్వైరవిహారం

నగరంలో కోతులు, కుక్కల దాడులు పెరిగిపోతున్నాయ్. రంగశాయిపేట, ఖిలావరంగల్, శివనగర్, పెరుకవాడ, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో జనావాసాల్లో సమూహాలుగా తిరుగుతూ ఇళ్లలో చొరబడి అందిన వస్తువులు ధ్వంసం చేస్తున్నాయి. పలుచోట్ల పాఠశాల విద్యార్థుల చేతిలోని భోజన బ్యాగులను లాక్కుంటున్నాయి. దీంతో చిన్నారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల రోడ్లపై దారికాచి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం

వరంగల్ : మాంసం ఉత్పత్తులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి చేయూతనిస్తోంది. యూనిట్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.కోటి కాగా, అందులో ప్రభుత్వం 50 శాతం రాయితీ అందిస్తోంది. గొల్ల కురుమలకే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులే.. పశు సంవర్ధక శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పథకంపై అంతగా ప్రచారం, అవగాహన లేకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల నుంచి స్పందన కొరవడింది. ఎన్‌ఎల్‌ఎం ద్వారా ఇంతవరకు కాటారం మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతుకు ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేశారు. పథకం కింద రూ.50 లక్షలు రాయితీ, రూ.40 లక్షలు బ్యాంకు రుణం, మిగతా రూ.10 లక్షలు లబ్ధిదారులు వాటాగా చెల్లించాలి. యూనిట్ కింద 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు ఇచ్చేవారు. యూనిట్ విలువ ఎక్కువగా ఉండటంతో బ్యాంకులు హామీ లేకుండా రుణాలు ఇవ్వడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎన్‌ఎల్‌ఎం పథకం నిబంధనలను సరళతరం చేస్తూ మార్పులు చేసింది. యూనిట్లను ఐదు విభాగాలుగా విభజించింది. ఇందులో ఏ యూనిట్ ఎంచుకున్నా



50 శాతం రాయితీ లభిస్తుంది. మేకలు, గొర్రెలే కాకుండా దేశవాళీ కోళ్లు, పందుల పెంపకం కూడా చేపట్టవచ్చు. వీటి యూనిట్ విలువ రూ.50 లక్షలకే పరిమితం. ఎంపిక చేసుకున్న యూనిట్ ఆధారంగా రెండు నుంచి పదెకరాల భూమి అవసరం ఉంటుంది. సొంత భూమి లేకుంటే లీజుకు తీసుకోవచ్చు. చుట్టూ ఫెన్సింగ్ వేసి, షెడ్లు నిర్మించి అందులోనే మేత ఏర్పాట్లు చేసుకోవాలి. అన్ని ఒరిజనల్ డాక్యుమెంట్లు జత చేస్తూ, ఆన్‌లైన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లేదా మండలాల్లో పశు వైద్యాధికారిని సంప్రదించాలి. అప్లికేషన్ కాపీలను జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.ఎంపిక విధానం : ఎన్‌ఎల్‌ఎంకు రాష్ట్ర స్థాయిలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు రుణం మంజూరైన తర్వాత 25 శాతం, యూనిట్ గ్రౌండింగ్ సమయంలో మిగతా 25 శాతం సబ్సిడీ వస్తుంది.అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

– వడ్లమూరి రంగారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎల్‌ఎం ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్లు పందుల పెంపకంతో పాటు ఫీడ్ అండ్ పుడర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. అన్ని యూనిట్లపైనా 50 శాతం సబ్సిడీ లభిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు ఒకరికి మాత్రమే యూనిట్ మంజూరైంది. లాభదాయకమైన ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

# సుందరంగా మారేదెన్నడో?




కరీంనగర్ : కరీంనగర్ ఆకర్షణీయ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా రహదారులు, పార్కులు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తుండగా అధ్వానంగా మారిన చౌరస్తాలను అదనపు హంగులు జోడించి నిర్మించేందుకు ప్రణాళికలు చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే కమాన్ చౌరస్తా, శ్రీపాదరావు కూడలి, నాకా చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, పాత ఎంప్లాయ్‌మెంట్ కూడలి, ఆర్‌అండ్‌బీ కూడలి, అంబేడ్కర్ చౌరస్తా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీలో మరిన్ని కూడళ్లను తీసుకొని తీర్చిదిద్దుతున్నారు.

ఆహ్లాదకరంగా.. ఆకట్టుకునేలా..

గతంలో విశాలమైన కూడళ్లు నిర్మించగా ఆ ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి కావు. వెడల్పుగా ఉండటంతో వాహనాలు ఆగకుండా నెమ్మదిగా వెళ్లే విధంగా అప్పటి అవసరాలకు తగ్గట్లుగా నిర్మించారు. వాహనాల సంఖ్య పెరగడం, వేగంగా రాకపోకలు సాగిస్తుండటం, పాదచారులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదురు కావడంతో ఆ విధానానికి స్వస్తి పలికారు. ఇప్పుడున్న కూడళ్లను కుదించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేశారు. ఆయా చౌరస్తాలలో అధునాతన డిజైన్లతో గ్రీనరీ, వాటర్‌ఫౌంటెయిన్, లైటింగ్స్, విభిన్న ఆకృతులు ఉండేలా మారుస్తున్నారు. శ్రీపాద కూడలిని ముట్టుకోకుండా, నాకాచౌరస్తా, ఆర్‌అండ్‌బీ జంక్షన్లకు మరింత అందాలు మెరుగు పర్చాలని భావిస్తున్నారు.

ఆరు నెలలుగా నత్తనడకన

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం, ప్రజలందరికీ అడ్డాగా ఉండే తెలంగాణ, ఇందిరాచౌక్ ప్రాంతంలోని కూడలి సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలల కిందట ప్రారంభించగా మూడు నెలలుగా ఎలాంటి పనులు చేయకుండా తవ్వి పెట్టారు. ఇందులోని ఎర్రమట్టి కూడా ఎక్కడ పడితే అక్కడికీ తరలించగా ఇప్పటికీ లెక్క తేల్చలేదు. బిల్లు రికార్డు చేసే సమయంలో ఆ మొత్తాన్ని మినహాయింపు ఇస్తామని చెబుతుండగా అదీ సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓల్డ్ పవర్ హౌజ్ కూడలిని గత నెల 19న ప్రారంభించడం, ఆ పనులు శరవేగంగా సాగుతుండటంతో గత్యంతరం లేక అప్పటి నుంచి వన్‌టౌన్, ఇందిరాచౌక్ కూడలిలో పనుల పురోగతి కొంతమేర కనిపిస్తోంది.

నెలాఖరులోగా పూర్తి చేస్తారా?

ఈనెలాఖరులోగా 13 జంక్షన్లను పూర్తి చేసేలా కార్యాచరణ తీసుకున్నట్లు ప్రకటించగా ఇప్పటికీ కొన్ని చోట్ల పనులే ప్రారంభం కాలేదు. మరో పది రోజులైతే ప్రకటించిన గడువు కూడా ముగియనుంది. ఆలోగా కనీసం మూడు కూడళ్లు కూడా పూర్తి చేసేలా కనిపించడం లేదు. మారుతీనగర్-ఓల్డ్ పవర్‌హౌజ్ జంక్షన్‌తో పాటు మరో మూడు కూడళ్లకు సంబంధించి అభివృద్ధి పనులు రూ.2.68 కోట్లతో నెల రోజుల కిందట ప్రారంభించారు. కాగా రామగుండం బైపాసు రోడ్డు, తీగల వంతెన, సదాశివపల్లి ప్రధాన రహదారి కూడలి నిర్మించేందుకు మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది. ఒకచోట విద్యుత్తు టవర్ అడ్డుగా ఉండటంతో దానిని తొలగించేందుకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. కనీసం మొదటగా ప్రారంభించిన చౌరస్తాల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది.

త్వరితగతిన పూర్తిజంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం అందుకుంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని చోట్ల ఇబ్బందులు రాగా పరిష్కారానికి చర్యలు చేపట్టాం.

నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఈ, నగరపాలిక

# అతివలకు అండగా ఆరోగ్య మహిళ



జగిత్యాల : ఆధునిక జీవన విధానంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రంలోని 100 ఆసుపత్రుల్లో కార్యక్రమం ప్రారంభం కానుండగా జగిత్యాల జిల్లాలోని ఐదు ఆసుపత్రులలో సేవలు ప్రారంభించనున్నారు.

జిల్లాలో ఇలా..జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని ఐదు ఆసుపత్రుల్లో మహిళలకు ప్రతీ ప్రత్యేక సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు చేసి మందులు ఇవ్వనున్నారు. తొలి విడతలో జగిత్యాల గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధర్మపురి మండలంలో నేరేళ్ల ఆరోగ్య కేంద్రం, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు ప్రారంభించనున్నారు.

మహిళా సిబ్బందితో పరీక్షలు

ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందించడానికి ఆయా ఆసుపత్రులలో వైద్యులు, పారామెడికల్, ఇతర సిబ్బందిని పూర్తిగా మహిళలనే నియమించారు. మహిళలు తమ అనారోగ్య సమస్యలు తెలపడానికి, సత్వర చికిత్సలు అందించడానికి, అవగాహన కల్పించడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహిళల్లో రక్తహీనత, థైరాయిడ్ చికిత్స, పలు క్యాన్సర్ల లక్షణాలుంటే నిర్ధారణ, గైనకాలజీ వ్యాధుల నిర్ధారణ, మందులు, రక్త పరీక్షలు, స్కానింగ్‌తోపాటు అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. ప్రతీ మహిళలు సేవలు పొందడానికి గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నారు.

మహిళలు సేవలను వినియోగించుకోవాలి– పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారిజిల్లాలోని ఐదు ఆసుపత్రులలో ఆరోగ్య మహిళ సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. ప్రతి ఐదు ఆసుపత్రులలో మహిళలకు ప్రత్యేకంగా సేవలు అందిస్తారు. మహిళలు సమీపంలోని ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఆరోగ్య సమస్యలకు చికిత్సతో పాటు మందులు పొందవచ్చు. మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తాం. గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించి పకడ్బందీగా అమలు చేస్తాం. ఆసుపత్రులలో సేవలను మహిళలు వినియోగిం చుకోవాలి.

# సాగు తగ్గే.. ధర పెరిగే

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో పప్పు ధాన్యాల సాగు ఏటా తగ్గిపోతోంది. దీంతో పప్పు ధర పెరుగుతోంది.ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు పప్పు కొనలేని పరిస్థితి నెలకొంది. నీరు సమృద్ధిగా లభించడంతో పాటు వరి ధాన్యానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండటంతో అన్నదాతలు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా పత్తి, మిర్చి పంటకు ధర బాగుండటంతో వాటిపై కూడా దృష్టి సారిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో కంది, పెసర, మినుముల పంటలు సాగు చేసినా.. వర్షాకాలంలో పంట నష్టపోవాల్సిన పరిస్థితి. వేసవిలో సాగు చేస్తే ఎండల కారణంగా, అకాల వర్షాల కారణంగా పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పెసర, మినుము పంటకు కోతులు నష్టం చేస్తుండటంతో అన్నదాతలు వెనకడుగు వేస్తున్నారు.

ప్రచారం కల్పించినా..వ్యవసాయ అధికారులు పంట నమోదు వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో కంది 6,564, పెసర 258, మినుము 153 ఎకరాల్లో సాగు చేశారు. పప్పు ధాన్యాల సాగు గణనీయంగా పడిపోవడంతో ఆ ప్రభావం పప్పు ధరలపై పడుతోంది. గతంలో సూర్యాపేట జిల్లా కంది, పెసర పంటలకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతసారి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పప్పు, చిరు ధాన్యాలపై సాగుపై అవగాహన కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేసినా.. ఆ దిశగా అన్నదాతలు దృష్టి సారించలేదు. గత యాసంగి వరి కొనుగోళ్ల సమయంలో అధికారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి పప్పు, చిరు ధాన్యాలపై దృష్టి సారించాలని, ఆశించిన స్థాయిలో ధర ఉంటుందని ప్రచారం కల్పించినా.. సాగులో అన్నదాతలు వెనకడుగు వేశారు. ప్రస్తుతం మార్కెట్లో పప్పు ధాన్యాలకు ధర బాగానే ఉన్నా.. ధాన్యం ఆశించిన స్థాయిలో రావడం లేదు. కంది, పెసర క్వింటాకు రూ.6,500 నుంచి రూ.8,500 వరకు ధర పలుకుతోంది. పప్పు ధరలపై ప్రభావంకంది, పెసర పంటలు ఇప్పటికే మార్కెట్లోకి రావాల్సి ఉంది. అయినా నేటికీ ధాన్యం రాక అంతంత మాత్రంగానే ఉండటంతో.. ఆ ప్రభావంతో పప్పు ధరలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కందిపప్పు, మినపగుండ్లు కిలో ధర రూ.150 చేరువవుతోంది. పెసర పప్పు కూడా అదే దారిన ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం పప్పు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం స్పందించి పప్పు ధాన్యాల వైపు రైతులను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

# వస్త్రోత్పత్తులకు నవశకం

సిరిసిల్ల: కార్మికులను యజమానులుగా మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరులోని వీవింగ్ పార్కులో షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరింది. ఇటీవల మరమగ్గాల ఎంపికపై కార్మికులు, వాటి తయారీ కంపెనీలతో వర్క్‌షాప్ జరిగింది. దీనిలో 4/1 అండర్ పిక్‌లో సెమీ ఆటోమెటిక్ మరమగ్గాలకు కార్మికులు ఆసక్తి చూపారు. వారి అభిప్రాయాలు, ఆయా కంపెనీల ధరల నివేదికను రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులకు పంపారు. తుది పరిశీలన తర్వాత మరమగ్గాల కొనుగోలుకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది. తొలి విడత 1,104 మంది కార్మికులకు 4,416 మరమగ్గాలను ఇవ్వనున్నారు. 2016-17లో రూ.370 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకాన్ని రూపొందించారు. ఒక కార్మికుడు, నాలుగు మగ్గాలతో యూనిట్‌గా తీసుకుని రూ.8 లక్షలుగా అంచనా వేశారు. దీనిలో రెండు మగ్గాలకు డాబీ, రెండు మగ్గాలకు జకార్డు అమర్చి ఇవ్వాలని నిర్ణయించారు. మగ్గాల తయారీలో ముడిసరకు ధరలు పెరగడంతో యూనిట్ విలువ రూ.10 లక్షలు దాటే అవకాశం ఉంది. ఇప్పటికే టెక్స్‌టైల్ పార్కు, పట్టణంలో కలిపి 30 వేల మరమగ్గాలున్నాయి. కొత్తగా పంపిణీ చేసే మగ్గాలపై ఎలాంటి ఉత్పత్తులు చేయవచ్చు అనే దానిపై కార్మికుల్లో ఆసక్తి నెలకొంది.జిల్లా వస్త్రపరిశ్రమలో టెక్స్‌టైల్ పార్కులో ర్యాపియర్, పట్టణంలోని పురాతన సాధారణ మరమగ్గాలు ఉన్నాయి. మొత్తంగా వీటిపై అయిదు వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ర్యాపియర్ మగ్గంపై ఒక షిఫ్టునకు సగటున 50 మీటర్లు, సాధారణ మగ్గాలపై 25 మీటర్ల ఉత్పత్తి చేయగలరు. టెక్స్‌టైల్ పార్కులోని వాటిపై షూటింగ్, షర్టింగ్‌లకే పరిమితం. అవి కూడా సాధారణ రకాలే. డిజైన్లు, చెక్స్ వంటివి రావు. వీటిపై చీరల ఉత్పత్తి సాధ్యం కాదు. సాధారణ మగ్గాలపై ముతకరకం పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులకే పరిమితం. వీటికి డాబీ, జకార్డులు అమర్చితే చీరల ఉత్పత్తికి అవకాశం ఉంది. ఎగుమతి రకాల ఉత్పత్తులు లేక ప్రైవేటు వస్త్రోత్పత్తుల ఆర్డర్లు రావడం లేదు.వర్కర్ టు ఓనర్ పథకంలో అందజేసే మరమగ్గాలు సెమీ ఆటోమెటిక్ మగ్గాలు. ఎలక్ట్రానిక్ డాబీ, జకార్డు అమర్చి ఉండటంతో నాణ్యతలో ఎగుమతి రకాలకు తీసిపోవు. వీటిపై కాటన్, పాలిస్టర్, సిల్క్ వస్త్రాలతో చేతి రుమాలు, లుంగీలు, తువ్వాలు మొదలుకొని పట్టుచీరల వరకు ఉత్పత్తి చేయొచ్చు. కంప్యూటర్‌లో డిజైన్లు రూపొందించి చిప్ ద్వారా వీటికి అనుసంధానించవచ్చు. ప్రస్తుతం పట్టణంలో ఉత్పత్తి చేస్తున్న బతుకమ్మ చీరల అంచుల డిజైన్లను చేతితో తయారు చేస్తున్నారు. సుమారు 16 వేల మగ్గాలపై కోటి మీటర్ల ఉత్పత్తికి ఎనిమిది నెలల సమయం పడుతుంది. కార్మికులకు ఇవ్వబోయే మగ్గాలపై డిజైన్ల ఎంపిక సులభమవుతుంది. నాణ్యతతో తక్కువ సమయంలో ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఫలితంగా కార్మికులపై పనిభారం తగ్గుతుంది. వీరి ఉత్పత్తుల నైపుణ్యాల ఆధారంగా ప్రైవేటు సంస్థల ఆర్డర్లు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పార్కులో 46 షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఒక షెడ్డులో ఒక్కో కార్మికుడికి 800 చదరపు గజాల్లో నాలుగు మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రంతోపాటు సామగ్రి భద్రపరచుకునే గదిని కేటాయిస్తారు. వీటితోపాటు పార్కు మొత్తానికి 6 వార్పిన్ యూనిట్లు కూడా ఉంటాయి.

# జలవనరుల్లో ఆక్రమణల పర్వం

సిరిసిల్ల : జలవనరులను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలతో చెరువు శిఖాలను నింపేస్తున్నారు. ఏళ్లుగా ఈ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. శిఖం ఆక్రమణలతో కబ్జాదారులు, కొందరు ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయలు సంపాదిస్తుంటే, సిరిసిల్ల పురపాలిక మాత్రం చాలా నష్టపోతోంది. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలమొస్తే కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. నాలాలు కుచించుకుపోతున్నాయి. ఇలాంటి అనేక సమస్యలకు కారణమైన ఆక్రమణలు.. కొన్ని చెరువుల్లో నేటికీ యథాతథంగా జరుగుతుండటం ఆందోళనకు తావిస్తోంది. సిరిసిల్ల పురపాలిక పరిధిలోని చెరువుల పరిరక్షణకు యంత్రాంగం గాలికొదిలేసినట్లుంది. ఆక్రమణల పర్వం సాగుతున్న తీరుపై పరిశీలన కథనం.

ఈదుల చెరువు కనుమరుగు

జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పురపాలక సంఘం ఎన్నికలకు ముందు చుట్టూ ఏడు గ్రామాలు విలీనమయ్యాయి. జరుగుతున్న అభివృద్ధితో పట్టణం విస్తరిస్తూ వస్తోంది. సిరిసిల్ల పట్టణం రగుడు నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యావలయ రహదారి నిర్మించారు. పట్టణంలోపలివైపు ఉన్న ఈదుల చెరువు సామర్థ్యం 26.67 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన కోనరావుపేట మండలం నుంచి గొలుసుకట్టు చెరువుల ద్వారా ఇందులోకి వరద నీరు వస్తుంది. ఇది నిండాక కొత్త చెరువులోకి చేరుతాయి. ప్రస్తుతం ఈ చెరువు సగం మేరకు కబ్జా అయింది. నిర్మాణాల వ్యర్థాలతో పూడ్చుతూ తాత్కాలిక కట్టడాలు చేపడుతున్నారు. గతేడాది వరదల సమయంలో నీటిపారుదల, జలవనరులశాఖ సర్వే చేపట్టింది. ఈ చెరువు ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్)లో 48ఇంటి నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు.

రాయిని చెరువులో నిర్మాణాలు

పట్టణంలో చాలా ఏళ్ల క్రితం రాయినిచెరువులో నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. కార్మిక వాడలుగా విస్తరించిన ఈ ప్రాంతవాసులకు పట్టాల పంపిణీకి చాలా ఏళ్లుగా అనేక రాజకీయ పార్టీలు ఉద్యమాలు చేశాయి. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వమే ఇళ్ల పట్టాలు అందజేసింది. ఇదే అదనుగా ముష్టిపల్లి, చిన్నబోనాల, కార్గిల్‌లేక్, చంద్రంపేట ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ప్లాట్ల కోసం నాలాలను ఆక్రమించి విక్రయాలు చేపడుతున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, నాలాల పరిధిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసిన సమయంలో అసలు విషయం బయటపడుతోంది. పలుకుబడి ఉన్నవారు ఎలాగోలా నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఇలాంటి వాటికి అనుమతులు మంజూరు కాక ఇప్పటికీ సిరిసిల్ల పురపాలికలో 75 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో చెరువు శిఖం, వరద నీటి కాల్వలను ఆక్రమించినవి ఉండటం గమనార్హం. గతంలో ఇలా ఇష్టారీతిన అనుమతులు ఇవ్వడంతోనే రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని కాలనీలు నీటమునిగాయి. వరద సాఫీగా వెళ్లేందుకు నాలాల విస్తరణ పనులు ప్రారంభించారు. నిధుల లేమితో కొత్త చెరువు వరకే పనులు పూర్తి చేశారు. దిగువన శాంతినగర్ ప్రాంతంలో పనులు జరగలేదు. నీటివనరుల ఆక్రమణలపై యంత్రాంగం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కాల్వలు లేని కార్గిల్‌లేక్

పట్టణంలోని కార్గిల్‌లేక్ ఎగువన వరద నీరు వచ్చేందుకు కాల్వలు ఉన్నాయి. 12.36 ఎంసీఎఫ్‌టీలున్న ఈ చెరువు అలుగు పారితే ఆ నీరంతా దిగువన మానేరువాగులో కలవాలి. వరద వెళ్లే కాల్వను పూడ్చేసి రియల్ వ్యాపారులు ప్లాట్లు పెట్టి విక్రయించారు. గతేడాది వరద నీరు వెళ్లలేని పరిస్థితిలో పురపాలిక, జలవనరులశాఖ అధికారులు మట్టి కాల్వను తవ్వించారు. సమీపంలోని అయ్యప్ప ఆలయం తర్వాత ఈ కాల్వ లేదు. చెరువులోకి వరద పోటెత్తితే ఎగువన ఉన్న తారకరామనగర్, ఇందిరానగర్ కాలనీలు ముంపునకు గురవుతాయి. వరద వెళ్లే కాల్వల కోసం సర్వే పూర్తి కాకుండానే మధ్యలో వదిలేశారు.

అనుమతులు ఇవ్వడం లేదు– అన్సారీ, టీపీవో

పురపాలక సంఘంలో విలీనానికి ముందు నుంచే ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయి. గతేడాది సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాం. కొన్నింటికి దరఖాస్తులు పెట్టుకున్నా వాటికి అనుమతులు ఇవ్వడం లేదు.

# ధాన్యం కమీషన్లతో ఆర్థిక అభ్యున్నతి

సిరిసిల్ల : ధాన్యం కొనుగోళ్లలో ముందుంటున్న మహిళా సంఘాలు.. వచ్చిన లాభాలతో ఆస్తులను కూడబెట్టుకుంటున్నారు.. మార్కెట్ యార్డులకు ప్రత్యామ్నాయంగా మారిన కొనుగోళ్లతో వచ్చిన కమీషన్‌ను సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి వాడుకుంటూనే గ్రామాల్లో స్థిరాస్తులను కూడబెడుతూ ఇతర సమాఖ్యలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

వరితో వీరి విజయం..

ఉమ్మడి జిల్లా వరి సాగులో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతి సీజన్‌లో లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణంతో ఏటా వానాకాలం, యాసంగి కలిపి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఈ దిగుబడినంతా మార్కెట్ కమిటీలు, పౌరసరఫరాల శాఖలు కొనుగోలు చేయలేని పరిస్థితి. అప్పుడు వీరికి ప్రత్యామ్నాయంగా 2006 నుంచి ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ద్వారా మహిళలు రంగంలోకి దిగారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నేటికీ కొనుగోళ్లు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం.. నాణ్యత, తూకాల్లో మోసం లేకపోవడం.. అమ్మిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెప్పిన సమయానికి చేతికందడం వీరి ప్రత్యేకత. ఇటీవల వానాకాలం 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

రెండేళ్లలో రూ.33.41 కోట్లు..

ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లలో నాలుగు సీజన్లలో ధాన్యం కొనుగోళ్లతో రూ.33.41 కోట్ల కమీషన్ మహిళా సంఘాలకు అందింది. 2006లో క్వింటాలు ధాన్యం కొనుగోలుపై రూ.12 కమీషన్ ఉండేది. ప్రస్తుతం కామన్ రకానికి రూ.31.25 'ఏ' గ్రేడుకు రూ.32 చెల్లిస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్మును గ్రామైక్య సంఘాల్లో జమ చేసి అవసరమైన సభ్యులకు తక్కువ వడ్డీకి ఇస్తున్నారు. మరికొన్ని సంఘాలవారు స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నారు. పక్కా భవనాలు నిర్మించి అద్దెలకిస్తూ సంఘాలను బలోపేతం చేస్తున్నారు. కరీంనగర్‌లోని జీవనజ్యోతి సమాఖ్యకు ధాన్యం, మక్కల కొనుగోలు ద్వారా రూ.1.50 కోట్ల కమీషన్ వచ్చింది. వీరికి ప్రభుత్వం స్థలం కేటాయించడంతో నాబార్డు ఆర్థిక సాయంతో గోదామును నిర్మించారు. దానిని ప్రస్తుతం పౌర సరఫరాలశాఖకు అద్దెకిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలోని మహిళా సమాఖ్యకు కేటాయించిన స్థలంలో కమీషను సొమ్ము రూ.19.50 లక్షలతో భవనాన్ని నిర్మించారు. దానిని ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయానికి, దుకాణాల నిర్వహణకు



అద్దెకిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం గూడెం, కోనరావుపేట మండలం కొండాపూర్‌లో కమీషన్ సొమ్ముతో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సొంతంగా స్థలం కొనుగోలు చేశారు.

భరోసా కలిగింది

2011 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాం. ప్రతి సీజన్‌కు స్థల సమస్య ఎదురయ్యేది. దీనికితోడు గ్రామైక్య సంఘంలోని సభ్యులకు ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నాం. 2019లో రూ.55 లక్షలతో ఐదు ఎకరాల స్థలం కొనుగోలు చేశాం. ప్రతి సీజన్‌లో రైతులకు సౌకర్యాలు కల్పించి ఇక్కడే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.2 కోట్లు ఉంటుంది. ప్రభుత్వ సాయంతో గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నాం.

పుప్పాల వనిత, పదిర, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, ఎల్లారెడ్డిపేట మండలంనిరుపేదలకు అండగా.. ధాన్యం కొనుగోళ్ల ద్వారా రూ.53 లక్షలను కూడబెట్టాం. నాబార్డు, ఎన్‌జీవోఎఫ్‌వ్ రుణసాయానికి తోడుగా ప్రభుత్వం అల్లునూరులో 2.30 ఎకరాల స్థలం కేటాయించింది. మొత్తం రూ.2.30 కోట్లతో 7500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించాం. 2011 నుంచి వీటిని పౌరసరఫరాలశాఖకు అద్దెకిచ్చాం. దీనిద్వారా జిల్లా సమాఖ్యకు నెలకు రూ.1.18 లక్షల ఆదాయం సమకూరుతోంది. వీటిని సంఘాల్లోని పేదలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తూ ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపయోగపడుతుంది. కోల హరిణి, సమాఖ్య అధ్యక్షురాలు, కరీంనగర్

## నాంపల్లి గుట్ట.. ఆక్రమణల పుట్ట!

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత దేవాలయమైన నాంపల్లి గుట్టపైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ స్థలం కబ్జాకు గురవుతోంది. గుట్టకు ఎక్కడా హద్దులు లేకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. దాని చుట్టూ ఆలయ స్థలంలో రోజుకో చోట ఆక్రమణలకు తెరతీస్తున్నారు. ఇటీవల మెట్ల దారి వైపు పెద్ద ఎత్తున తవ్వి చదును చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టగా అధికారులు అడ్డుకున్నారు. దీన్ని బట్టి కబ్జాదారులు ఎంతగా బరితెగించారో ఊహించవచ్చు. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు మాత్రం సర్వే చేసి హద్దులు ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం నాంపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ గుట్ట 101.28 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. దీనిపై స్వామివారి కొలువై ఉన్నారు. గుట్ట ప్రాంతంలోనే ముంపు గ్రామాల కాలనీలు ఏర్పాటు కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కొందరు అక్రమార్కులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి గుట్ట స్థలాన్ని కూడా అక్రమార్కులు చదును చేస్తున్నారు. ఇప్పటికే దాని చుట్టూ అక్కడక్కడ నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన రోడ్డు పక్కన గుట్టను ఆనుకొని పాత రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. గుట్టపైకి వెళ్లే కమాన్ ప్రాంతంలోనూ స్థలాన్ని ఆక్రమించారు. ఇలా ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హద్దుల ఏర్పాటుతోనే అడ్డుకట్ట

నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుట్టను పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తేనే ఆక్రమణలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. చుట్టూ పునరావాస కాలనీలను నిర్మించడం, నాంపల్లి ప్రాంతం వేములవాడ మున్సిపల్‌లో విలీనమవడంతో ఇక్కడ భూముల ధరలు పెరిగిపోయాయి. నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ (వీటీఏడీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు కబ్జాలకు తెరతీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్ట చుట్టూ సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట పడేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# హమాలీల జీవితం.. గాలిలో దీపం



ఖమ్మం : వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న హమాలీల జీవితం దుర్భరంగా మారింది. ఇటు వ్యాపారికి, అటు రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విపణికి వెన్నుదన్నుగా నిలుస్తున్న వీరి ఆర్థిక పరిస్థితులు మాత్రం మారడం లేదు. ఖమ్మం జిల్లాలో 8, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 7 కలిపి మొత్తం 15 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల మంది హమాలీలు పనిచేస్తున్నారు. ఒక్క ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌పైనే సుమారు 3 వేల మంది హమాలీ కార్మికులు ఆధారపడ్డారు. పని దొరికితే పర్వాలేదు. లేకుంటే పస్తులుండటమే. మార్కెట్ కమిటీ వీరికి కేవలం లైసెన్స్ మాత్రమే ఇస్తుంది. అలాగే ఏడాదికి రెండు జతల దుస్తులు అందజేస్తుంది. అంతకుమించి ఎలాంటి సాయం చేయదు. చాలామంది హమాలీలు పని చేసే సమయంలో గాయపడి... అస్వస్థతకు గురవుతుంటారు. అయినా వీరికి ఇక్కడ ఎలాంటి ప్రథమ చికిత్స అందుబాటులో లేదు. ఆకస్మికంగా మృతి చెందినా, అనారోగ్యంతో కన్నుమూసినా, పనిచేసే సమయంలో గాయపడినా ఎలాంటి బీమా సౌకర్యం లేదు. బాధిత కుటుంబానికి మాత్రం బీఆర్ఎస్‌కేవీ సంఘం దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుంది. వయసు పైబడిన అనేక మంది మోకాళ్లు, నడుము నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి ఎలాంటి సాయం లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తూ మార్కెట్ల ఆదాయం పెంచటంలో కీలకపాత్ర పోషించిన హమాలీలకు ఆ శాఖ నుంచి ఎలాంటి పింఛను లభించటం లేదు. చేతనైనన్ని రోజులు పనిచేయటం, తర్వాత మానేయడం పరిపాటి. జీవితానికి ఎలాంటి భద్రత లేకుండా పోయింది. అనేక మంది అనారోగ్యాలతో బాధపడుతున్నారు. కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారు.

కనీస సాయం కరవు..

వ్యవసాయ మార్కెట్లలోని పత్తి, మిరప, అపరాల యార్డుల్లో పని చేస్తారు. వీరే లేకుంటే విపణి నుంచి ఒక్క బస్తా కూడా కదలదు. మార్కెట్‌కు వచ్చిన రైతు సరకును దిగుమతి చేయటం, వ్యాపారి కొనుగోలు చేసిన తర్వాత ఎగుమతి చేయటం ద్వారా విపణిలో ఒక్క బస్తా కూడా లేకుండా నిత్యం ఖాళీ చేస్తుంటారు. విపణిలో ఒక్కో బస్తా దిగుమతి చేయటంతో పాటు కాంటా వేసినందుకు వీరికి రూ.10 చెల్లిస్తారు. ఇలా విపణిలో కొంతమంది హమాలీలు కలిసి బృందాలుగా ఏర్పడి పనిచేస్తుంటారు. పని పూర్తయిన తర్వాత వచ్చిన డబ్బును పంచుకుంటారు. సీజన్‌లో వీరికి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు కూలి అందుతుంది. ఆగస్టు నుంచి నవంబరు వరకు అన్‌సీజన్ ఉంటుంది. ఈ సమయంలో వారికి ఉపాధి దొరకదు. కొన్నిసార్లు రోజుకు రూ.50 నుంచి రూ.100 వరకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కేవలం విపణికి వచ్చిన సరకు మీద మాత్రమే ఆధారపడి జీవిస్తారు. ఎండాకాలం సీజన్‌లో మార్కెట్లో మిరప ఘాటును తట్టుకోవడం చాలా కష్టం. అలాంటిది వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో మిరప ఘాటులో పని చేసి మార్కెట్‌కు అండగా నిలుస్తున్నారు. కేవలం రైతు ఇచ్చే కూలిపై ఆధారపడి పనిచేస్తున్నారు. ప్రభుత్వపరంగా మాత్రం వీరికి ఎలాంటి ఆర్థిక వెసులుబాటు లేదు.

ఏళ్ల తరబడి మార్కెట్‌ను నమ్ముకుని జీవిస్తున్న హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి. వారు ఈ పని తప్ప మరో పని చేయలేరు. రైతులు, వ్యాపారులు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వీరి సేవలు మరువలేనివి. పని చేయలేని పరిస్థితిలో ఉన్న హమాలీలకు మార్కెటింగ్‌శాఖ పింఛను అందించాలి. మార్కెట్లలో వారికి భోజన, తాగునీటి సౌకర్యం కల్పించాలి. అత్యవసర వైద్యసేవలను అందుబాటులో ఉంచాలి. రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేయాలి. పాలకవర్గంలో వ్యాపారులను డైరెక్టర్లుగా తీసుకున్నట్లే హమాలీ కార్మికులకూ డైరెక్టర్లుగా ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడే వారి సమస్యలు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే వెసులుబాటు ఉంటుంది. నున్నా మాధవరావు, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

# పదేపదే.. అదే తప్పు..!



చర్ల : భూదస్త్రాల ప్రక్షాళన అనంతరం భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయి. చర్ల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా 2018, 2019లో ఓ అధికారి భారీగా పట్టాలు జారీ చేశారు. అసైన్డ్ స్థలాలకూ భూ హక్కులు కల్పించారు. కుదునూరు(జడ్), చింతకుంట(జడ్), తేగడ(జి), కొత్తపల్లి(జడ్), వీరాపురం, మొగళ్లపల్లి(జడ్), ఎంపీపల్లి, సి.కత్తిగూడెం తదితర రెవెన్యూ గ్రామాల్లో అక్రమ పట్టాదారు పుస్తకాలు జారీ అయ్యాయని సమాచారం. షెడ్యూల్డ్ ఏరియాలో క్రయవిక్రయాలు నిషిద్ధమైనా అప్పటికే కొన్న వందలాది ఎకరాలకు సదరు అధికారితో పాటు తదుపరి వచ్చిన కొందరు అధికారులు రూ.లక్షలు దండుకొని అడ్డదారిలో పట్టాలిచ్చారనే ఆరోపణలున్నాయి. దుమ్ముగూడెం మండలంలో భూ అక్రమాలకు బాధ్యుడిని చేస్తూ అక్కడి తహసీల్దారును కలెక్టర్ అనుదీప్ సస్పెండ్ చేయడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ చెరువులకు సైతం ఆ అధికారి పట్టాలు చేసి అక్రమాలకు పాల్పడిన వైనంపై ఇటీవల గవర్నర్‌కూ కొందరు ఫిర్యాదు చేశారు. బదిలీపై వెళ్లిన ఆ అధికారి వేరే మండలంలోనూ ఇదే తంతు నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ షెడ్యూల్ చట్టాన్ని తుంగలో తొక్కి గతంలో జరిగిన భూ అక్రమాలపై హైకోర్టులో గిరిజన సంఘం తరఫున పిటిషన్ దాఖలైంది.

మళ్లీ అక్రమార్కుల చెరలోకి..

గోదావరి పరివాహకంలో అప్పట్లో జరిగిన భూఆక్రమణలపై వరుస కథనాలు ప్రచురితమవటంతో అధికారులు సర్వే జరిపి రూ.కోట్ల విలువ చేసే భూములను 2018లో స్వాధీనపరచుకున్నారు. వీరాపురం మొదలుకొని జీపీపల్లి, కత్తిగూడెం, చింతకుంట, మొగళ్లపల్లి, కొత్తపల్లి గోదావరి పరివాహక ఇసుకపాయ, సందుపాయ లంకల్లో విలువైన భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడారు. సుమారు 80 ఎకరాల ఆక్రమిత భూముల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల తర్వాత ఆ భూములను మళ్లీ కొందరు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి బంగారం లాంటి లంక భూములకు ఎకరాకు ఏడాదికి కౌలు ధర రూ.95వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోంది. ఇలాంటి భూములు చాలావరకు ఆక్రమణలోనే కొనసాగుతున్నా.. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. చివరకు అక్రమార్కులు శ్మశానాలను సైతం వదలటం లేదు. లంక భూముల్లో పాతిన హద్దురాళ్ల వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. యాక్ట్ 1/70కు విరుద్ధంగా కొన్న భూములకు పట్టాలు జారీ చేయటం నేరం. ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం లేదు. భరణిబాబు, తహసీల్దారు, చర్ల

# ఎవరి వేడుకకీ జాప్యం?

కొత్తగూడెం : పట్టణ ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కొత్తగూడెం పురపాలకం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వేడుకల మందిరం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.25 లక్షల అంచనా వ్యయంతో పురపాలక రాజీవ్ పార్కు సమీపంలో ఐదేళ్ల క్రితం ఫంక్షన్ హాలు నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రధాన హాలుకు అదనంగా రెండు గదులు, భారీ వంట షెడ్డు నిర్మించాలన్నది ప్రణాళిక. కానీ నిధులు లేకపోవడంతో ఆయా పనులు సగంలో ఆపేశారు. ఏడాదిలోగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పినా.. ఏళ్లు గడిచిపోతున్నాయి. వేడుకల భవనాన్ని పూర్తిచేస్తే ప్రజలపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు పురపాలకానికి మంచి ఆదాయ వనరుగా మారుతుంది. అధికారుల చొరవేదీ? ఏ నిధులు అందుబాటులో ఉంటే ఆ నిధులను (అవైలబుల్) కేటాయించాలన్నది తీర్మానం. ఇలా ఇప్పటి వరకు రూ.20 లక్షలు వెచ్చించారు. సగం వరకు పనులు రెండేళ్ల క్రితమే పూర్తిచేశారు. ఆ తర్వాత నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ సామాజిక భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 'పట్టణ ప్రగతి' నిధులు కేటాయిస్తున్నారు. నాలుగు నెలల క్రితం దాదాపు రూ.40 కోట్ల అంచనాతో పలు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఒక్కో వార్డుకు సగటున రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు దక్కనున్నాయి. ఈ కేటాయింపుల్లో 27వ వార్డులోని ఫంక్షన్ హాల్‌ను



విస్మరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు వెచ్చిస్తే వేడుకలు జరుపుకొనేలా భవనం రూపుదిద్దుకునే అవకాశం ఉంది. వేడుకల భవనం ఫ్లోరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, చేతులు శుభ్రం చేసుకునే పంపు కనెక్షన్లు, వంట షెడ్డు ప్లాస్టింగ్, గ్రీనరీ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కనీసం జిల్లా ఉన్నతాధికారులైనా ఈ సమస్యపై దృష్టిసారించాలన్నది 'గూడెం' వాసుల విన్నపం.

# బాంబుల మోత.. భయాందోళన..!

మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా గుట్టలను పేల్చివేస్తున్నారు. క్రషర్ మిల్లుల పేరిట కొందరు అనుమతులు పొంది ఆ పరిశ్రమలను నిర్వహిస్తూ జిలెటిన్ స్టిక్స్‌ను అక్రమంగా మోతాదుకు మించి అమర్చి గుట్టలను పేల్చివేస్తున్నారు. పగటి వేళలో బోర్‌మిషన్లతో డ్రిల్లింగ్ చేసి సాయంత్రం జిలెటిన్ స్టిక్స్‌తో పేలుస్తున్న తీరు సమీప ప్రాంతవాసుల్ని భయాందోళనకు గురి చేస్తోంది. ఇళ్లు బీటలువారుతున్నాయి. బోరు బావులు కూలిపోయి నీళ్లు రావడం లేదు. సమీపంలోని పంట పొలాల్లో సైతం రాళ్లు పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు జరుపుతున్నా భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. జిల్లాలో సుమారు 30 క్రషర్లు ఉన్నట్లు అధికారిక రికార్డులు తెలుపుతున్నాయి. వాటిలో పది, పదిహేను క్రషర్ మిల్లులు పని చేస్తున్నాయి. అనుమతి లేకుండా మరో పది నిర్వహిస్తున్నారు. ఈ మిల్లులకు అవసరమైన కంకర ముడి సరకు కోసం గుట్టలను పిండి చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు వాటి నిర్వహణ అనుమతులు తమ పరిధిలోకి రావంటూ ఆయా శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెట్టివేస్తున్నారు.

స్థిరాస్తి వ్యాపారులు సైతం..

కొందరు స్థిరాస్తి వ్యాపారులు వ్యయసాయ యోగ్యం కాని గుట్టలు ఉన్న భూములను కొనుగోలు చేసుకొని వెంచర్లు చేస్తున్నారు. ఆ స్థలాల్లో ఉన్న పెద్ద గుట్టలను రాత్రికి రాత్రే పేల్చివేసి చదును చేస్తున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని నలువైపుల ప్రతి రోజు గుట్టలను పేల్చివేస్తున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. భారీ యంత్రాలను మోహరించి గుట్టలను పేల్చివేసిన రాళ్లను పదుల సంఖ్యలో లారీలతో క్రషర్లకు తరలిస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని నాలుగు కాలనీలకు చెందిన ప్రజలు జిల్లా అదనపు కలెక్టర్‌కు అక్రమ పేలుళ్లపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హుటాహుటిన అక్కడికి వెళ్లిన అధికారులు ఒక వాహనాన్ని సీజ్ చేసి మిగిలిన వాటిని వదిలివేశారు. ముఖ్యప్రజాప్రతినిధులు ఆ వ్యాపారులకు అండగా నిలవడంతో వెనుదిరిగి వచ్చినట్లు ఆ శాఖకు చెందిన సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇలా పట్టణ నలుమూలలతో పాటు కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, కురవి, డోర్నకల్, దంతాలపల్లి మండలాల్లో నిత్యం ఎక్కడో ఒక్క చోట పేలుళ్లు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అనుమతి లేకుండానే..

మహబూబాబాద్ పట్టణంలోని తాళ్లపూసపల్లి రోడ్‌లో ఉన్న పెద్ద గుట్టలను కొందరు స్థిరాస్తి వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా పేల్చివేస్తున్నారు. ఓ రైతుకు చెందిన



భూమిని కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు సంబంధిత శాఖల అధికారుల అనుమతి తీసుకోకుండానే జిలెటిన్ స్టిక్స్ పేల్చి గుట్టలను కరిగిస్తున్నారు. ఇటీవల స్థానికులు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మైనింగ్ శాఖాధికారులు వెళ్లి ఒక వాహనాన్ని సీజ్ చేశారు. వారం రోజులు విరామమిచ్చి మళ్లీ పేలుళ్లు ప్రారంభించారు.

ఇళ్లకు పగుళ్లు

దంతాలపల్లికి చెందిన కొక్కు యశోదకు చెందిన ఈ ఇంటిపై కప్పు పగిలిపోయింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ క్రషర్‌లో బాంబులు పేల్చిన సమయంలో భారీ శబ్దాలతో భూమి కంపిస్తోంది. ఈ ఇంటిలాగానే పక్క ఉన్న ఇళ్లు కూడా పగుళ్లు చూపుతున్నాయి.

పెచ్చులు ఊడిపడుతున్నాయి

కొక్కు యశోద, దంతాలపల్లి

మా ఇంటికి సమీపంలో ఉన్న క్రషర్ కోసం గుట్టకు బాంబులు అమర్చి పేల్చివేస్తున్నారు. ఆ శబ్దాలకు గోడలు పగుళ్లే చూపడంతో పాటు ఇంటి పైకప్పు పెచ్చులు ఊడి మీద పడ్డాయి. ఎన్నిసార్లు చెప్పిన వారు వినిపించుకోకుండా బాంబులు పెడుతున్నారు.

భయమేస్తోంది..సోమయ్య, జయశంకర్‌కాలనీ, మహబూబాబాద్

మహబూబాబాద్–తాళ్లపూసపల్లి రోడ్‌లో సుమారు 20 ఎకరాలకు పైగా విస్తరించిఉన్న భూమిలో ఎత్తైన గుట్టలను పేల్చివేసేందుకు కొందరు స్థిరాస్తి వ్యాపారులు ప్రతి రోజు సాయంత్రం, రాత్రి సమయాల్లో జిలెటిన్ స్టిక్స్ అమర్చి గుట్టలను పేలుస్తున్నారు. సమీప కాలనీల్లోని ఇళ్లు ఆ పేలుళ్ల ధాటికి బీటలువారుతున్నాయి. రెండు నెలలుగా ఈ ప్రక్రియ జరుగుతోంది. ఇటీవల అధికారులు వచ్చి పేల్చివేతలు నిలిపివేయాలని చెప్పి వెళ్లినా కూడా కొనసాగిస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మాకు సంబంధం లేదురవీందర్, జిల్లా మైనింగ్ శాఖాధికారి

క్వారీలు, క్రషర్ మిల్లుల నిర్వహణకు అనుమతులు ఇస్తాం. బాంబు పేలుళ్ల అనుమతులు మాకు సంబంధం లేదు. వారు ఎంత ముడి సరకు తీసుకెళుతున్నారనే విషయంపైనే శాఖ దృష్టి సారిస్తుంది. గుట్టలకు బాంబులు అమర్చడం, వాటి వల్ల నష్టపోయినవారికి సాయమందించడం మా శాఖ పరిధిలోకి రాదు.

# గోదావరి నీరు.. వచ్చేదెన్నడు సారూ?

నర్సాపూర్ : నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడానికి మంజీరా నీటి పథకానికి అనుబంధంగా శివ్వంపేట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన గోదావరి నీటి పథకం వృథాగా మారింది. పనులు పూర్తయి ఏడాదవుతున్నా పథకం అలంకార ప్రాయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దీన్ని ప్రారంభించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వర్షాభావంతో..మూడేళ్ల కిందట తీవ్ర వర్షాభావ పరిస్థితులతో నర్సాపూర్ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. చక్రియాల వద్ద నది పూర్తిగా ఎండిపోవడంతో నియోజకవర్గంలోని 399 ఆవాస ప్రాంతాలకు మంజీరా పథకం నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. వందల అడుగుల లోతులో బోర్లు తవ్వినా చుక్కనీరు పడలేదు. దీంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. నర్సాపూర్ ప్రాంతానికి గజ్వేల్ సమీపంలోని కోమటిబండ నుంచి గోదావరి జలాలు తరలించడానికి హామీ ఇచ్చారు. రూ.30 కోట్లు విడుదల చేశారు.

అలంకారప్రాయంగా..చక్రియాల నుంచి వయా దౌల్తాబాద్, నర్సాపూర్, తూప్రాన్ మీదుగా గజ్వేల్ వరకు ఉన్న మంజీరా నీటి పథకం ప్రధాన పైప్‌లైన్ల ద్వారానే గోదావరి నీటిని కోమటిబండ నుంచి శివ్వంపేటలో నిర్మించిన సంప్ వరకు తెచ్చారు. ఇక్కడ సంప్ నిర్మాణం పూర్తయింది. 630 కేవీఏ విద్యుత్తు నియంత్రికను సైతం బిగించారు. ఆరు మోటార్లను నీటి పంపింగ్‌కు ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. శివ్వంపేట, వెల్దుర్తి మండలాల్లోని 79 నివాస ప్రాంతాలకు గోదావరి నీటిని సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందించగా అటకెక్కింది. శివ్వంపేట మండలం దొంతి, చిన్నగొట్టి ముక్కలో ఉన్న భారీ ట్యాంకులను గోదావరి నీటితో నింపి ఇక్కణ్నుంచి రెండు మండలాలకు సరఫరా చేయాలనుకున్నారు. ఆచరణలో పెట్టకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది. ట్రయల్‌రన్ పూర్తిచేశాం..– ప్రవీణ్‌చారి, డీఈ, మిషన్ భగీరథ పథకంకోమటిబండ నుంచి గోదావరి నీటిని శివ్వంపేట సంపులోకి తరలించడం పూర్తి చేశాం. ట్రయల్ రన్ చేపట్టాం.

# తెగని గొలుసు.. లేదు అదుపు

మంచిర్యాల : జిల్లాలో మద్యం గొలుసు దుకాణాల దందా మూడు సీసాలు.. ఆరు పెట్టెలుగా సాగుతోంది. మారుమూల తండాలు, గూడేలలోనూ మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వ లైసెన్స్ పొందిన దుకాణాలు ఉదయం 10 గంటల తర్వాత తెరిస్తే, గ్రామాల్లో మాత్రం వేకువజాము నుంచే మందు అందుబాటులో ఉండటంతో మత్తులో మునిగితేలుతున్నారు. గొలుసు దుకాణాలను దక్కించుకొనేందుకు రూ.లక్షల్లో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. దీంతో పగలు రాత్రి అనే తేడా లేకుండా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాను ఆపాల్సిన ఆబ్కారీ అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

'గొలుసు'ను కాపాడుతున్న మద్యం వ్యాపారులు.!

జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా మద్యం ఏరులై పారుతోంది. లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులే తమ లాభం కోసం గొలుసు దందాను ప్రోత్సహిస్తున్నారు. అధికారులను మంచి చేసుకొని వ్యాపారాలను సాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వైన్స్ షాపులు దక్కించుకొన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి ఆ మండలంలోని గ్రామాలను పంచుకొని అమ్మకాలు కొనసాగిస్తున్నారు. వేలం నిర్వహించేలా వీడీసీలను ప్రోత్సహిస్తూ ఆదాయాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు. మద్యం వ్యాపారులు, ఆబ్కారీ అధికారుల చేతులు తడుపుతుండటంతోనే ఈ గొలుసు దందా ఏ ఆటంకాలు లేకుండా సాగుతోందనే విమర్శలున్నాయి.

నాటు సారా నుంచి కాపాడేందుకేనట.!



నాటుసారా స్థావరాలపై దాడులకు పాల్పడుతున్న ఆబ్కారీ అధికారులు.. రహదారి పక్కనే దాబాలు, కిరణాలు, టీ హొటళ్లలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నా వాటి పైన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలా వెలిసిన గొలుసు దుకాణాలపై దాడులు ఎందుకు చేయడం లేదని ఓ ఆబ్కారీ అధికారిని ప్రశ్నిస్తే.. 'గ్రామాల్లో విచ్చలవిడిగా పెరిగిపోతున్న నాటుసారా తాగి జనాలు అనారోగ్యం పాలవుతున్నారనే ఉద్దేశంతోనే గ్రామాల్లో మద్యం అందుబాటులో ఉండేలా చేస్తున్న గొలుసు దుకాణాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు' పేర్కొనడం గమనార్హం.

ఊరూరా వేలం పాటలే..

జిల్లాలో ఎక్కడ చూసినా గొలుసు దుకాణాల వేలంపాటలు పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. ఖానాపూర్ మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్, గోసంపల్లె, ఎల్లాపూర్, రాజూరా, సత్తనపల్లె, గోడలపంపు, పెంబి మండలంలో తాటిగూడ, ఇటిక్యాల్, పస్పుల గ్రామాల్లో గొలుసు దుకాణాలకు వేలం నిర్వహించారు. భైంసా, లక్ష్మణచాంద, కడెం, దస్తూరాబాద్‌లోనూ గ్రామాభివృద్ధి కమిటీల ద్వారా అనధికారికంగా నిర్వహించిన వేలం పాటల్లో రూ.లక్షలు పలికాయి. ఖానాపూర్ పట్టణానికి నాలుగు కి.మీ. దూరంలో ఉండే బాదన్‌కుర్తిలో రూ.50 వేలు పలుకగా, రాజూరాలో మూడు దుకాణాలకు వేలం నిర్వహించగా.. ఒకదానికి రూ.2.7 లక్షలు, మరో రెండింటికి రూ.1.2 లక్షల చొప్పున మొత్తంగా రూ.5.10 లక్షలు వీడీసీలకు దక్కినట్లు సమాచారం. భైంసాలో గల్లి గల్లీలో కిరాణా కొట్టుల్లా గొలుసు దుకాణాలు వెలిశాయి. తాజాగా భైంసాలోని కామోల్‌లో రూ.10 లక్షలకు వేలం పాడినట్లు తెలుస్తోంది.

తనిఖీలు చేస్తున్నాం– సంపత్‌కుమార్, ఎక్సైజ్ సీఐ, నిర్మల్

అన్ని గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు విస్తృతంగా చేపడుతున్నాం. సిబ్బంది కొరత కారణంగా కొంత ఇబ్బంది అవుతోంది. నిబంధనలు అతిక్రమించి మద్యం గొలుసు దుకాణాలు నిర్వహించే వారిపైనా తగిన చర్యలు తీసుకుంటాం.

# పనులు చేసి.. పస్తులు!

నిర్మల్ : కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఇతర జిల్లాల్లో ఉపాధిహామీ కూలీలకు వేగంగా వేతనాలు అందుతుండగా నిర్మల్ జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఉపాధి కూలీలు రెండు నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, పేర్లు, అకౌంట్ల నమోదులో సాంకేతిక లోపాలు తలెత్తడంతో కూలీ డబ్బులు రాక పలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు చేసినా పైసలు రాకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

పెద్ద మొత్తంలో..వ్యవసాయ పనులు పూర్తి కావడంతో గ్రామాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున ఉపాధి పనులకు వెళ్తున్నారు. చెరువులు, కుంటల్లో పూడికతీత, అటవీ ప్రాంతాల్లో ట్రెంచీల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నారు. జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో 1,29,082 జాబ్‌కార్డులుండగా 2,35,229 మంది కూలీలున్నారు. ప్రస్తుతం 82,534 మంది పనులకు వెళ్తున్నారు. దాదాపు ఒక్కో పంచాయతీలో 207 మంది కూలీలు పనులకు వస్తుండడంతో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే వీరికి రావాల్సిన డబ్బులు సుమారు రెండు నెలలుగా విడుదల కాలేదు.

సాంకేతిక లోపాలతో..ఉపాధి హామీ పథకం అమలు కోసం గతంలో రాగాస్ అనే సాఫ్ట్‌వేర్ ఉండేది. దీని స్థానంలో ప్రభుత్వం ఎన్ఐసీ అనే సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. దీనిని ఈ నెల నుంచి అమలులోకి తీసుకొచ్చారు. కూలీల పూర్తి సమాచారం, వారి లెక్క పక్కాగా ఉండేందుకు పారదర్శకత కోసం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) విధానాన్ని అమలు చేసింది. అయితే ఎన్ఐసీలో కూలీల వివరాల నమోదు విషయంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో డబ్బులు జమకావడం లేదు. సాఫ్ట్‌వేర్‌లో పది మంది కూలీలకు ఒక మస్టర్ చొప్పున తయారు చేసి పేరు, అకౌంట్ నంబరు, జాబ్‌కార్డు నంబరు తదితర వివరాలను నమోదు చేశారు. అయితే అకౌంట్ నంబరు విషయంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డ చోట్ల ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. పాత పంచాయతీగా ఉన్న సమయంలో నమోదైన అకౌంట్ నంబరు, మళ్లీ కొత్త వాటిలో నమోదు చేస్తుండటంతో సాఫ్ట్‌వేర్ తిరస్కరించడం వంటి లోపాలతో వేతనాలు జమ కావడం లేదు. ఫిబ్రవరి 26 వరకు మాత్రమే డబ్బులు వచ్చాయి. ఆ తర్వాత రాలేదు. దీంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

పనులు చేస్తున్న వీరిది సోన్ మండలం గంజాల్ గ్రామం. ఇక్కడ పెద్ద మొత్తంలోనే కూలీలు పనులకు వస్తున్నారు. ప్రస్తుతం చెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయి. అయితే సుమారు రెండు నెలలుగా వీరికి వేతనాలు అందలేదు. వస్తాయని చెప్పడమే తప్ప ఇప్పటి వరకు వాటి జాడేలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం– విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిసాంకేతిక సమస్యలతో వేతనాలు ఆలస్యమయ్యాయి. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కూలీలు డబ్బుల విషయంలో ఆందోళన చెందవద్దు. వారు చేసిన పనులకు పూర్తి స్థాయిలో వేతనాలు వస్తాయి.

# పంచాయతీలపై విద్యుత్తు ఛార్జీల భారం



మంచిర్యాల : అరకొర నిధుల కారణంగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు, పురపాలక సంఘాలకు పెరిగిన విద్యుత్తు ఛార్జీలు మరింత భారం అయ్యాయి. గత నెలతో పోలిస్తే.. ఒక్కో పంచాయతీ అదనంగా నాలుగైదు వేలు ఎక్కువ బిల్లు వచ్చింది. జిల్లాలోని కొన్ని పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు ట్రాక్టర్ల వాయిదాలు, కార్మికుల వేతనాలు తదితరాలకు సరిపోతున్నాయి. ప్రతి నెలా పంచాయతీల్లోని వీధి దీపాలు, ఇళ్లకు తాగు నీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల స్థానిక సంస్థలకు కూడా యూనిట్ ఛార్జీలు పెంచడంతో ఎక్కువ మొత్తం బిల్లులు రావడంతో చెల్లింపు కష్టంగా మారిందని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు.జిల్లాలో వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా బాధ్యత ఆయా సర్పంచులు, కార్యదర్శులు చూసుకోవాలి. వీటికి అయ్యే విద్యుత్తు బిల్లులను గతంలో ప్రభుత్వం చెల్లించేది.. ప్రతి నెల చెల్లింపులు లేకపోవడంతో బకాయిలు కోట్లకు చేరుకునేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులను ప్రతి నెల పంచాయతీలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. వీధి దీపాల నిర్వహణ సరిగా లేకపోవడంతో బిల్లులు వేలల్లో వచ్చేవి. పంచాయతీలపై భారం తగ్గించేందుకు ప్రైవేట్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సర్పంచులు వ్యతిరేకించడంతో ఎప్పటి మాదిరిగా పంచాయతీలే వీధి దీపాలను నిర్వహిస్తున్నాయి. యూనిట్ ఛార్జీలు పెంచడంతో బిల్లులు ఎక్కువగా వచ్చాయి.

జిల్లాలో 3,050 విద్యుత్తు కనెక్షన్లు

జిల్లాలో 468 పంచాయతీలు ఉన్నాయి. వీధి దీపాల మీటర్లు 1,859, తాగు నీటి సరఫరా మీటర్లు 1,191 ఉన్నాయి. ఆదిలాబాద్ పురపాలక సంఘంలో వీధి దీపాలు 393 ఉండగా, తాగు నీటి సరఫరాకు సంబంధించిన మీటర్లు 60 ఉన్నాయి. వీధి దీపాల్లో అత్యధికంగా ఉట్నూరు మండలంలో 219 మీటర్లు ఉన్నాయి. ఇంద్రవెల్లిలో 173, బేలలో 169 మీటర్లు ఏర్పాటు చేశారు. 60 శాతం పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులు ప్రతి నెల 20 వేలకు పైగా ఉంటోంది. తాగు నీటి సరఫరాకు సంబంధించి నేరడిగొండలో అత్యధికంగా 142 మీటర్లు ఉన్నాయి. తర్వాత బోథ్‌లో 116, ఇంద్రవెల్లిలో 91, గుడిహత్నూర్ మండలంలో 83 మీటర్లు ఉన్నాయి.

పెరిగిన ఛార్జీలు

వీధిదీపాలకు గతంలో యూనిట్ ఛార్జీ రూ.5 ఉండేది. యూనిట్‌పై రూపాయి పెంచడంతో తాజాగా రూ.6 అయింది. నీటి సరఫరా విద్యుత్తు కనెక్షన్లకు యూనిట్‌కు రూ.6.10 ఉండేది. ఇప్పుడు రూ.7.10 అయింది. ఈ లెక్కన ఒక్కో పంచాయతీకి నెల బిల్లులో అదనంగా నాలుగైదు వేలు భారంగా మారింది. కొన్ని పంచాయతీల్లో అయితే గత నెల రూ.20 వేలు బిల్లు వస్తే ఛార్జీలు పెరిగిన తర్వాత రూ.30 వేలు బిల్లు వచ్చింది. పురపాలక సంఘంలో పన్నులు, తదితరాలతో ఆదాయం సమకూర్చుకొని, నెట్టుకొస్తుండగా, పంచాయతీలు మాత్రం ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనికితోడు మూడు నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నయాపైసా విడుదల చేయకపోవడంతో కొన్నిచోట్ల కార్యదర్శులు అప్పులుచేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్ల వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఉండటంతో కార్యదర్శుల ఖాతాల నుంచి బ్యాంకులు వాయిదాలను మినహాయించుకుంటున్నట్లు కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీల విద్యుత్తు బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని సర్పంచులు కోరుతున్నారు.

# తేమ.. తాలు పేరిట.. తూకంలో కోత



మంచిర్యాల : యాసంగి వరి కోతలు ప్రారంభం కానున్న తరుణంలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మద్దతు ధర కల్పించేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల ఉదాసీనత...సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిబంధనలను అడ్డం పెట్టుకుని తేమ.. తాలు పేరుతో మిల్లర్ల దోపిడీ.. దీనికి తోడు సరిపోయే గోనె సంచులు లేక.. తూకం...ధాన్యం తరలింపులో ఆలస్యం.. ఇదిలా ఉంటే అకాల వర్షం రైతన్నకు శాపంగా మారుతోంది. గత సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటేనే రైతన్నకు గిట్టుబాటు దక్కనుంది.

మోటారు బావులు, వాగులు, చెరువుల కింద ముందుగా సాగైన చోట వరి కోతలు ప్రారంభమయ్యాయి. నాట్లు ఆలస్యమైన పొలాల్లో మరో పది రోజుల్లో కోతకు రానున్నాయి.ధాన్యం కొనుగోళ్ల నిబంధనల్లో ఉన్న కొన్ని లోపాలను అడ్డం పెట్టుకుని నిర్వాహకులు, మిల్లర్లు పలు చోట్ల అక్రమాలకు తెరదీస్తున్నారు. తేమ, తాలు ఎక్కువగా ఉందంటూ క్వింటాలుకు 2 నుంచి 3 కిలోల మేర అనధికార కోత విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ధాన్యం తూకం వేసే సమయానికి తేమ నిబంధనల మేరకే ఉన్నప్పటికి.. వెంటనే తరలించకపోవడంతో వాతావరణ ప్రభావంతో తేమ పెరిగితే ఇదే అదనుగా మిల్లర్లు కోత విధిస్తున్నారు. తూకంలో ఆలస్యం వల్ల రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలస్యమైతే వాతావరణంలో మార్పులు, మబ్బులు రావడంతో ఉదయం ఆరబోయడం...సాయంత్రం కాగానే తిరిగి కుప్పచేయడం దినచర్యగా మారుతోంది. ప్రభుత్వం తూర్పార యంత్రాలు (ప్యాడీ క్లీనర్లు) అందిస్తే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వెంట వెంట తూకం వేసి ధాన్యం తరలిస్తే ఇబ్బందులుండవు.

కవర్లకు అద్దె భారం..

ధాన్యం కుప్పలను కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్‌లు లేకపోవడంతో రైతులే అద్దెకు తెచ్చుకుని కప్పుకొంటున్నారు. కవరుకు రోజుకు రూ. 15 చొప్పున అద్దెతో మొత్తం ఎకరాకు 500 నుంచి రూ. 800 వరకు చెల్లించాల్సి వస్తోంది. కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉంచి.. ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా చూడాలి. గతంలో ఏమేర కొనుగోళ్లు జరిగాయో ఆ లెక్కన కవర్లు అందుబాటులో ఉంచితే రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

చిరిగిన సంచులతో ఇబ్బందులు..

కొత్త గోనె సంచులు కొనుగోలు చేస్తున్నామని అధికారులు చెపుతున్నా.. చాలా వరకు పాత సంచులే పంపిస్తున్నారు. వీటిలో చిరిగిన సంచులు వస్తుండటం వల్ల ఇవి సరిపోక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాతవి కాకుండా కొత్త సంచులు అందజేయాలి.

సమస్యలు లేకుండా చర్యలు– ప్రేంకుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి, మంచిర్యాల

గతంలో సమస్యలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యమైన గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచడంతో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ధాన్యం ఎప్పటికప్పుడు తూకం వేసి వెంట వెంట తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు నిబంధనలకు అనుగుణంగా బాగా ఆరబెట్టి తప్ప, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలి. కోత విధిస్తే రైతులు తమ దృష్టికి తేవాలి.

# పల్లెల్లో ఎన్నికల సందడి

ఆదిలాబాద్: జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల స్థానాల ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు జిల్లా అధికారులు వారికి నివేదిక పంపించారు. ఒక పంచాయతీలో రెండు వార్డులు, మరో పంచాయతీలో ఒకటి, ఇంకో పంచాయతీలో మూడు వార్డులు ఇలా అంతా కలిపి జిల్లాలోని 129 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. పదోతరగతి పరీక్షల దృష్ట్యా ఎన్నికలు జాప్యమయ్యే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుండగా మరోపక్క అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.కరోనా నేపథ్యంలో పల్లెల్లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికల నిర్వహణ జాప్యమైంది. ఆదిలాబాద్ జడ్పీటీసీ స్థానంతోపాటు ఉట్నూర్ మేజర్ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతోపాటు మరో ఎనిమిది సర్పంచి స్థానాలు, 226 వార్డుల్లో పోరుకోసం కొత్త ఓటరు జాబితాను రూపొందించారు. చాలాచోట్ల సర్పంచులు చనిపోవడంతో అక్కడ తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉట్నూర్ మేజర్ పంచాయతీని పురపాలక సంఘంగా మారుస్తారని ప్రతిపాదనలు సిద్ధం కావడంతో ఆ సమయంలో ఉట్నూర్‌కు ఎన్నికలు నిర్వహించలేదు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇటు పురపాలకంగా మార్చేందుకు అడ్డంకిగా మారడంతో తాజాగా అక్కడ సర్పంచి, వార్డు స్థానాలకు ఎన్నిక ఉండనుంది. ఇంకో పక్క జిల్లాలోనే కీలకంగా ఉన్న ఆదిలాబాద్ జడ్పీటీసీ స్థానంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. జిల్లా పరిషత్‌లో ఖాళీగా ఉన్న వైస్‌ఛైర్మన్ పదవికి ఇది ముడిపడి ఉండటంతో ఇటు తెరాస, అటు విపక్షాలు బలంగా ఉండడం వల్ల జడ్పీటీసీ ఎన్నికకు ఆయా పార్టీలు ఏడాదిన్నర నుంచే కసరత్తు చేస్తున్నాయి. పలు సర్పంచి స్థానాల్లోనూ ఇదే ఆసక్తి కనిపిస్తోంది. ఓటరు జాబితా రూపొందించిన అనంతరం ఎన్నికల కమిషన్ వ్యయం వివరాలు కోరింది.

# రక్తశుద్ధి.. పెరిగిన రద్దీ..

మంచిర్యాల : రోజురోజుకీ మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నా, చికిత్స అందించే కేంద్రాల సంఖ్య అంతంతమాత్రంగానే ఉంది. బాధితులకు సమీపంలో కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో చాలామంది డయాలసిస్ చేసుకునేందుకు సైతం రావడం లేదు. చికిత్స అందక పలువురు ప్రాణాలు కూడా వదిలేస్తున్నారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఒకటే ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. వందల సంఖ్యలో వ్యాధిగ్రస్థులు ఉన్నా ఒకే కేంద్రం దిక్కవుతోంది. దాదాపు ఇక్కడే 24 గంటలపాటు కొంచెం కష్టమైనా 5 షిఫ్టులతో ప్రతిరోజు 50 మందికి రక్తశుద్ధి చేస్తున్నారు.

జిల్లాకు మరొకటి మంజూరైనా..బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ రోగులు ఎక్కువగా ఉన్నారంటూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే చిన్నయ్య కోరిక మేరకు ఐదు పడకలతో కూడిన రక్తశుద్ధి కేంద్రాన్ని మంజూరు చేస్తూ వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులిచ్చింది. కానీ ఇక్కడి సామాజిక



ఆరోగ్యకేంద్రానికి ప్రాంతీయ ఆసుపత్రిస్థాయి వచ్చిన తర్వాతే ఏర్పాటు చేయాలంటూ అందులో సూచించింది. వంద పడకల భవనం నిర్మాణంలో ఉన్నా.. ఇప్పట్లో పూర్తిఅయ్యే అవకాశాలు కనిపించడంలేదు. భవనం అందుబాటులోకి వచ్చినా.. కావాల్సిన వైద్యులు, సిబ్బందిని నియామకం చేసే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో రక్తశుద్ధి కేంద్రం సేవలు ప్రారంభం కావాలంటే మరికొంత కాలం ఎదురుచూడాల్సిందే.

కరీంనగర్ బాట..ప్రస్తుతం మంచిర్యాలజిల్లా కేంద్రంలో వందమందికి మించి వ్యాధిగ్రస్థులకు చికిత్స అందించే అవకాశం లేకపోవడంతో పలువురు తప్పని పరిస్థితుల్లో కరీంనగర్‌బాట పడుతున్నారు. ఇంకొందరు గోదావరిఖనికి వెళ్తున్నట్లు సమాచారం.

ఆసిఫాబాద్‌కు అత్యవసరం..మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇప్పటికే పది పడకలతో రక్తశుద్ధి కేంద్రం సుమారు వందమందికి పైగా బాధితులకు సేవలందిస్తోంది. ఇక్కడికి వచ్చే వ్యాధిగ్రస్థుల్లో 60 శాతం కుమురంభీం ఆసిఫాబాద్‌జిల్లాకు చెందిన వారే ఉన్నారు. ప్రతిరోజు 70–80 కిలోమీటర్ల దూరం నుంచి రోగులు అవస్థలు పడుతూ మంచిర్యాలకు వస్తున్నారు. వీరికి అందుబాటులో ఉండే విధంగా ఆసిఫాబాద్‌జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఆసిఫాబాద్‌లో ఇప్పటికే జిల్లా ఆసుపత్రిస్థాయి భవనం అందుబాటులో ఉంది. ఇందులో ఐదుపడకలతో రక్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మంచిర్యాలకు భారం తగ్గడంతో పాటు ఆ జిల్లాకు చెందిన రోగులకు దూరభారం తగ్గుతుంది.

# ఇటుక బట్టీలకు చెరువుల మట్టి

ఆసిఫాబాద్: అన్నదాతలకు సాగునీరు అందించే చెరువులను అక్రమార్కులు చెరపడుతున్నారు. ఇష్టానుసారంగా రాత్రీపగలు తేడా లేకుండా తవ్వుతున్నారు. అనుమతులు లేకుండా నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జేసీబీలు పెట్టి తవ్వుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లుగానే ఉంటున్నారు. నిరంతరం ట్రాక్టర్ల రొదతో, రోడ్లపై దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. చెరువులో ఎక్కడ పడితే అక్కడ తవ్వడంతో భారీ గోతులు ఏర్పడి నీరు నిలిచి ఇందులో మూగజీవాలు పడి చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ల రాకపోకల వల్ల చెరువు గట్లు సైతం దెబ్బతింటున్నాయి. జిల్లావ్యాప్తంగా 70కి పైగా ఇటుక బట్టీలు ఉండగా, ఇందులో 19 మాత్రమే అనుమతులు కలిగి ఉన్నాయి. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం ప్రాంతంలో పదుల సంఖ్యలో బట్టీలు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారు. గొల్లగూడ చెరువు వద్ద పొక్లయిన్ సాయంతో మట్టి తీస్తుండగా, ఇటీవలే గ్రామస్థులు అడ్డుకోవడంతో తవ్వకాలు నిలిపివేశారు. మిగతా చెరువుల వద్ద మాత్రం స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో కొనసాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో చెరువుల సమీపంలోనే బట్టీలను ఏర్పాటు చేశారు. గన్నారం గ్రామ సమీపంలో మూడు చెరువుల నుంచి జోరుగా మట్టిని తరలిస్తున్నారు. ఏటా ఈ సమయంలోనే భారీగా మట్టిని తరలించి నిల్వ చేసుకుంటున్నారు. ప్రస్తుతం రెబ్బెన, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), వాంకిడి, పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లోని చెరువుల నుంచి మట్టి తీస్తున్నారు. కాగజ్‌నగర్, వాంకిడి, సిర్పూర్(టి) మండలాల్లో పలు ప్రాంతాల్లో చెరువుల భూముల్లోనే బట్టీలను ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇవీ..ఇటుక బట్టీల ఏర్పాటుకు రూ.16,500 గనులశాఖకు చెల్లించి అనుమతులు తీసుకోవాలి. ఇటుకల తయారీకి సాధారణంగా వారంతా చెరువుల నుంచి మట్టి తీస్తారు. ఇందుకు క్యూబిక్ మీటర్‌కు రూ.30 చొప్పున గనులశాఖకు చెల్లించి అనుమతులు తీసుకోవాలి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, నీటి పారుదలశాఖ అధికారుల ఆధ్వర్యంలో వారు సూచించిన ప్రదేశంలోనే తవ్వకాలు సాగాలి. జిల్లాలో ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. అసలు అధికారులను సంప్రదించకుండానే తవ్వకాలు చేపడుతున్నారు. బయట ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1000 వరకు విక్రయిస్తున్నారు.

లి కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం సమీపంలోని చెరువు వద్ద తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న మూడు చెరువుల్లో పొక్లయిన్లు పెట్టి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తీసుకెళ్తున్నారు. ఇటుక బట్టీలతో పాటు, బయట ఈ మట్టిని కావాల్సిన వారికి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. ఈజ్‌గాం సమీపంలోని మాండ్వ గ్రామ సమీపంలోని చెరువులోనూ తవ్వకాలు చేపడుతున్నారు. చెరువు గట్టు మీద నుంచే ట్రాక్టర్లు వెళ్లడంతో కొంత భాగం ధ్వంసమైంది.

ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు..– నాగరాజు, ఏడీ, గనులశాఖ

అనుమతులు లేని ఇటుక బట్టీలను తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తాం. చెరువుల్లో మట్టి తీసుకోవడానికి ఎవరూ అనుమతులు తీసుకోలేదు. ఇలా మట్టిని తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. తరలించిన మట్టిని పరిశీలించి, రెట్టింపు జరిమానా విధిస్తాం.




# అమరావతికే కేంద్రం జై!

## ఆంధ్ర రాజధానిగా దానికే గుర్తింపు - కేంద్రీయ సచివాలయ నిర్మాణ అంచనా వ్యయం 1,500 కోట్లకు పెంపు

న్యూఢిల్లీ : రాజధాని అమరావతిని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నప్పటికీ.. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా కేంద్రం దానినే అధికారికంగా గుర్తిస్తోంది. దాని రికార్డుల్లో ఇదే స్పష్టమవుతోంది. అమరావతి అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం మంగళంపాడినా.. అక్కడి తన ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయిస్తూనే ఉంది. తాజాగా అమరావతిలో నిర్మించతలపెట్టిన కేంద్రీ య సచివాలయం అంచనా వ్యయాన్ని రూ.1,500 కోట్లకు పెంచింది. తక్షణమే రూ. కోటి కేటాయించింది. గతేడాది ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,244.19 కోట్లుగా ఉంది. 2023-24 బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులను ఆయా అవసరాల కోసం కేటాయిస్తూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సమగ్ర పద్దుల వివరాలను విడుదల చేసింది. అందులో ముఖ్యంగా 'ఆంధ్ర ప్రదేశ్‌లోని గుంటూ రు జిల్లా అమరావతి రాజధాని పట్టణం రాయపూడిలో కేంద్రీయ సచివాలయం భవన నిర్మాణానికి' అన్న హెడ్‌ను సృష్టించింది. రూ.1,500 కోట్ల అంచనా వ్య యంతో నిర్మిస్తున్న ఈ భవనానికి 2023-24లో రూ.కోటి కేటాయిస్తున్నట్లు పేర్కొంది. అలాగే రూ.46.76 కోట్ల అంచనా వ్యయంతో విశాఖ డాబాగార్డెన్స్‌లో ఆదాయపు పన్ను శాఖ నూతన భవన నిర్మాణానికి, రూ.18.17 కోట్ల వ్యయంతో విశాఖలో కేంద్ర జీఎస్టీ సిబ్బంది క్వార్టర్ల నిర్మాణానికి రూ. కోటి చొప్పున, విశాఖలో రూ.10 కోట్ల వ్యయంతో జనరల్ పూల్ ఆఫీస్ అకామడేషన్ (జీపీఏవో) నిర్మాణానికి రూ.50 లక్షలు, అందుకు రూ.5 కోట్లతో భూమి కొనుగోలుకు రూ.లక్ష కేటాయించింది. కేంద్రీయ సచివాలయం సహా మిగతా ప్రాజెక్టులన్నిటికీ అంచనా వ్యయాలు భారీగా ఉన్నప్పటికీ కేంద్రం నామమాత్రపు కేటాయింపులు చేయడం గమనార్హం.

# మళ్లీ కొవిడ్ కలవరం.. 5.63శాతానికి పాజిటివిటీ రేటు



దిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి మళ్లీ చాప కింద నీరులా వ్యాపిస్తుండటం కలవరపెడుతోంది. గత కొన్ని రోజులుగా కొత్త కేసులు అమాంతం పెరుగుతున్నాయి. అటు మరణాలు కూడా నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా 24 గంటల వ్యవధిలో 6,155 మంది కొవిడ్ వైరస్ బారిన పడగా.. పాజిటివిటీ రేటు 5శాతం దాటింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. వైరస్ వ్యాపిస్తున్న ప్రాంతాలను (ఎమర్జెన్సీ హాట్‌స్పాట్స్) గుర్తించి దాని కట్టడికి చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు.

**తాజా కొవిడ్ గణాంకాలు ఇలా ఉన్నాయి..** 24 గంటల్లో కొత్త కేసులు – 6,155 (మొత్తం కేసులు 4.47 కోట్లు) యాక్టివ్ కేసులు – 31,194 (0.07శాతం) 24 గంటల్లో మరణాలు – 11 (ఇప్పటివరకు మొత్తం మరణాలు 5,30,954) రోజువారీ పాజిటివిటీ రేటు – 5.63శాతం. మొత్తం కోలుకున్న వారు – 4.41కోట్లు రికవరీ రేటు – 98.74శాతం. తాజా వ్యాప్తికి ఎక్స్‌బీబీ.1.16 లేదా ఆర్క్టురుస్‌గా పిలిచే కొత్త వేరియంట్ కారణమని వైద్యరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు ఈ వేరియంట్‌కు సంబంధించి 100కు పైనే కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. గత వేరియంట్‌లతో పోలిస్తే ఎక్స్‌బీబీ.1.16 వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యరంగ నిపుణులు హెచ్చరించారు. ఈ వేరియంట్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# కట్టని ఇళ్ల వద్ద సెల్ఫీలు దిగటం సిగ్గుచేటు..

## వైయస్ జగన్ కడుతున్న ఊళ్లను చూస్తే బాబు గుండె ఆగుతుంది

## నెల్లూరులో బాబు సెల్ఫీపై రాష్ట్ర మంత్రి జోగి రమేశ్



అమరావతి: నారా చంద్రబాబు, లోకేశ్ సెల్ఫీ బాబులు, కామెడీ రాజాలుగా తయారయ్యారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ ఎద్దేవా చేశారు. పేదలకు వారు నిర్మించిన ఇళ్లంటూ నెల్లూరులో టిడ్కో ఇళ్ల వద్ద బాబు సెల్ఫీ దిగడంపై మంత్రి ఒక ప్రకటనలో స్పందించారు. టీడీపీ హయాంలో నెల్లూరులో టిడ్కో ఇళ్ళు, ఇప్పుడున్న ఇళ్ల నాడు-నేడు ఫోటోలను విడుదల చేశారు. నెల్లూరులో టిడ్కో ఇళ్లన్నీ ఆయనే కట్టేశానని చెప్పుకోవడానికి సిగ్గులేదా? అని చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబే టిడ్కో ఇళ్లన్నీ కట్టేస్తే మరి వైఎస్ జగన్ ప్రభుత్వం కట్టినవేమిటని అన్నారు. టిడ్కో ఇళ్ల రూపంలో పేద, మధ్యతరగతి ప్రజలకు చంద్రబాబు చేసిందేమీ లేదని చెప్పారు. టిడ్కో ఇళ్ల పేరిట పేదవారి ఆశలను ఆసరాగా చేసుకుని అవినీతికి పాల్పడ్డారని అన్నారు. చదరపు అడుగు నిర్మాణానికి ఆ రోజుల్లో రూ.1,000-1,100 మధ్య ఖర్చయితే అంతకు రెండు మూడు రెట్లు అధికంగా టెండర్లు ఖరారు చేసి దోచేశారన్నారు. అది కూడా ఒక్క చోటా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని, అస్తవ్యస్తంగా వదిలేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాకే టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, అన్ని మౌలిక వసతులతో ప్రజలకు అందిస్తోందని తెలిపారు.

# ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం నిరశన దీక్షలు



విజయవాడ: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం నిరశన దీక్షలు చేపట్టింది. నల్ల కండువాలతో విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ప్ల కార్డులతో ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు , పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 11వ పీఆర్సీ ప్రతిపాదిత స్కేళ్లు అమలు చేయాలని, పీఆర్సీ అరియర్లు, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీలో ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో సర్కార్ ఉందని బొప్పరాజు విమర్శించారు. ఉద్యోగులకే రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారా? వాలంటీర్లు, సలహాదారులుగా ఉన్న వారికి రూ. 20 వేల కోట్లు ఇస్తున్న మాటను ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. సర్వీసు రూల్స్ కూడా సరిగ్గా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాలలో ఉద్యోగుల పరిస్థితి బాగుందని, మలిదశ పోస్టర్లు విడుదలతో ఉద్యమం మొదలై తీవ్రతరం అవుతుందన్నారు. ప్రభుత్వ యాప్ వినియోగాన్ని నిలిపి వేస్తూ సెల్ ఫోన్ డౌన్ చేస్తామని బొప్పరాజు స్పష్టం చేశారు.

# ఏపీలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడింది: యనమల

అమరావతి: ఏపీలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పంటకు మద్దతుధర లేక క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. 2019-20లో వ్యవసాయ ఉత్పత్తి 175 లక్షల టన్నులు ఉంటే.. ప్రస్తుతం 169 లక్షల టన్నులకు పడిపోయిందని విమర్శించారు. అగ్రికల్చర్ గ్రోత్ 2022-23లో 4.54 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఆహార ధాన్యాల దిగుబడులు పెరిగాయంటూ సీఎం జగన్ అసత్యాలు చెబుతున్నారని తప్పుబట్టారు. సాగు విస్తీర్ణం తగ్గితే వృద్ధిరేటు ఎలా పెరిగిందో చెప్పాలి? అని యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. దుక్కి నుంచి దిగుబడి వరకు, విత్తనం నుంచి విక్రయం వరకు, పొలం నుంచి ఫలసాయం వరకు రైతులను చేయి పట్టుకుని నడిపిస్తామన్న జగన్ సర్కార్.. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెద్దగా పెంచలేదు. సాగు రంగానికి పెద్దగా ఊతం ఇవ్వలేదని వ్యవసాయ రంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు.

కొత్త పథకాల ఊసే లేని ఈ బడ్జెట్‌లో పాత పథకాలకూ అరకొరగానే నిధులు కేటాయించింది. వ్యవసాయంలో నష్టాలొచ్చి రైతు బలవన్మరణాలకు పాల్పడితే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాలో పెంపుదల లేదు. నిధుల కేటాయింపు నామమాత్రంగానే చేసింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎక్కువ భాగం కేంద్ర ప్రయోజిత పథకాల వాటాతోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. నిరుటి దాకా చాలా పథకాలను వినియోగించుకోని జగన్ సర్కార్ ఈ ఏడాది వాటికి రాష్ట్ర వాటా నిధులు కేటాయించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు 2023-24 బడ్జెట్‌లో రూ.41,436.29కోట్లు ప్రతిపాదించిన ప్రభుత్వం 2022-23 కంటే రూ.1,616.49 కోట్లు తగ్గించింది. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద 2023-24లో రూ.7,220 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.4,020కోట్లుగా ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అంటే కేంద్రం వాటా రూ.3,200 కోట్లుగా ఉంది. ఈ ఏడాది రూ.13,500 చొప్పున. 52.38 లక్షల మందికి రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ సుమారు 2లక్షల మంది కౌలు రైతులు, అటవీ భూ హక్కు సాగుదారులు, దేవాలయ మాన్యాల సాగుదారులకు మాత్రమే రూ.13,500 ఇస్తోంది. ఈ ఏడాది పంటల బీమాకు రూ.1,600 కోట్లు, విపత్తుల సహాయ నిధి కింద రూ.2 వేల కోట్లు ప్రతిపాదించింది

# బాబు వార్నింగ్స్...సీనియర్లకు గుబులు



అమరావతి : చంద్రబాబు చండ ప్రచండమైన హెచ్చరికలు చేశారు. ఉత్తరాంధ్రా సదస్సుకు వచ్చిన ఆయన అందరి జాతకాలు తన దగ్గర ఉన్నాయని పార్టీ వారి గురించి చెప్పడమే చర్చనీయాంశంగా ఉంది. ఇంట్లో కూర్చుకుని ఎవరు ఆందోళనలు చేస్తున్నారో తెలుసు అన్నారు. ముందే మాట్లాడుకుని పోలీసులను పిలిపించుకుని హౌస్ అరెస్టు అయిన వారూ తెలుసు అన్నారు. తన దగ్గర ఎవరి ఆటలు సాగవని అన్నారు. తాను పనిచేసేవారికే టికెట్లు ఇస్తానని మరో మారు ఖండితంగా బాబు చెప్పారు. యువతకు అందులో నలభై శాతం టికెట్లు ఈసారి ఇస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో సీనియర్లలో ఆందోళన మొదలైంది. నాలుగేళ్ల పాటు కష్టపడి పనిచేసిన వారికే పార్టీలో పెద్ద పీట వేస్తామని బాబు క్లారిటీగా చెప్పారు. విశాఖలో జరిగిన టీడీపీ సదస్సుకు సీనియర్ నేతలు మూడు జిల్లాల నుంచి తరలి వచ్చారు. అయితే పార్టీలో వర్గ పోరుని సహించేది లేదని గ్రూపులు కట్టినా బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చెసినా ఇది టీడీపీ అని గుర్తు పెట్టుకోవాలని బాబు అనడం విశేషం. కాళ్ళ బేరానికి రావడానికి వైసీపీ కాదు అని చురకలు అంటించారు. ఇదిలా ఉంటే బాబు విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ మంత్రుల తీరు పట్ల పూర్తిగా అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. అదే టైం లో ఆయన పార్టీలో సీనియర్లు చాలా చోట్ల జూనియర్లను పక్కన పెట్టడం మీద కూడా మండిపడుతున్నారని అంటున్నారు. అందరినీ కలుపుకుని పోవాలనుకుంటే నాయకులు తామే ఉండాలని ఎదగాలని భావించడం తప్పు అని బాబు అంటున్నారు. ఇక గంటా శ్రీనివాసరావు టీడీపీలో నాలుగేళ్ల పాటు సౌండ్ చేయలేదు. ఇపుడు ఆయన మళ్లీ యాక్టివ్ అయ్యారు. అయితే చంద్రబాబు విశాఖ వచ్చిన సందర్భంగా గంటా ఆయనకు పూర్వపు ప్రాభవం దక్కిందా అంటే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పార్టీ నాయకుల అందరికీ బాబు నమస్కారం పెట్టారు. ఈ సందర్భంగా సీనియర్ నేతగా ఉన్న అయ్యన్నపాత్రుడికి బాబు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం కనిపించింది. ఇక అయ్యన్న సైతం సభకు ఆలస్యంగా రావడం ద్వారా గంటాకు పార్టీలో ప్రాధాన్యత దక్కితే ఊరుకోమన్న సంకేతాలని పంపించారు అంటున్నారు. ఈ మధ్య గంటా వైసీపీని ఎక్కువగా విమర్శిస్తున్నారు.

అదే టైంలో అయ్యన్నపాత్రుడితో పాటు ఆయన వర్గం సైలెంట్ గా ఉంటోంది. గంటా దూకుడుకు ఆదిలోనే అడ్డుకట్ట వేయాలని కూడా చూస్తోంది. పార్టీలో మొదటి నుంచి పోరాడుతున్న వారికే పెద్ద పీట వేయాలని అయ్యన్న సూచిస్తున్నారు. చంద్రబాబు కూడా దానికి అంగీకరించినట్లు గానే ఆయన స్పీచ్ ఉందని అంటున్నారు. మరి గంటా రీ యాక్టివ్ అయినా తెలుగుదేశంలో ఆయనకు మునుపటి వైభోగం దక్కుతుందా అంటే వేచి చూడాలనే అంటున్నారు. అయితే రాజకీయంగా ఢక్కా మెక్కీలు తిన్న గంటా తనదైన వ్యూహాలను రచిస్తారని అంటున్న వారూ ఉన్నారు. మొత్తానికి పార్టీలో కొత్త నాయకత్వం రావాలని పార్టీ ఇంకా బలపడాలని చంద్రబాబు చెబుతున్న మాటలు సీనియర్ నేతలకు గుబులు కలిగిస్తున్నాయి. ఎంతసేపూ పాత ముఖాలతోనే ఎన్నికలకు వెళ్ళడమేనా కొత్త వారిని తెస్తామన్నట్లుగానే బాబు మాటల భావం ఉందని అంటున్నారు. అదే టైం లో సీనియర్లు చలా మంది ఉన్నా పార్టీ అనుకున్న స్థాయిలో ఇంకా బలపడలేదు అన్న అసంతృప్తి అయితే బాబులో ఉందని అంటున్నారు.




# సుఖోయ్‌లో ప్రయాణించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

గువాహటి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈశాన్య రాష్ట్రం అస్సాంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె తొలిసారిగా సుఖోయ్-30 యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఈ ఉదయం తేజ్‌పూర్‌లోని భారత వాయుసేనకు చెందిన వ్యూహాత్మక వైమానిక స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ము.. తొలుత భద్రతా దళాల నుంచి సైనిక వందనం అందుకున్నారు. అనంతరం ఆమె ఫ్లయింగ్ సూట్ ధరించి సుఖోయ్-30 విమానంలో కొద్దిసేపు విహరించారు. ఈ విమానాన్ని గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ తివారీ నడిపారు. కాగా.. అంతకుముందు 2009లో భారత తొలి మహిళా రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ కూడా యుద్ధ విమానంలో ప్రయాణించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత గురువారం అస్సాం చేరుకున్నారు. శుక్రవారం కజిరంగ జాతీయ పార్కులో జరిగిన గజ్ ఉత్సవ్‌ను ఆమె ప్రారంభించారు. పర్యటనలో భాగంగా మౌంట్ కాంచనగంగ సాహసయాత్ర - 2023ను కూడా ఆమె ప్రారంభించారు.

# ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో భారీగా ఐపీఎస్ బదిలీ జరిగింది. 39 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జరిగాయని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటికే 56 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు తాజాగా మళ్లీ రెండు జీవోలను ఏపీ ప్రభుత్వం జారీ చేసింది. ఏలూరు రేంజ్ డీఐజీ- GVG అశోక్‌కుమార్, గుంటూరు రేంజ్ ఐజీ- G పాలరాజు, అనంతపురం రేంజ్ డీఐజీ - RN అమ్మిరెడ్డి, సెబ్ డీఐజీ-M రవిప్రకాష్, APSP డీఐజీ- B రాజకుమారి, DGP ఆఫీస్ అడ్మిన్ డీఐజీ-సర్వశ్రేష్ట త్రిపాఠి, గ్రేహౌండ్స్ డీఐజీ-కోయ ప్రవీణ్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ-శంకబ్రత బాగ్చి, CID ఐజీ-సీహెచ్ శ్రీకాంత్, విశాఖపట్నం సిటీ కమిషనర్-త్రివిక్రమ్ వర్మ, విశాఖ లా అండ్ ఆర్డర్ డీసీపీ- వాసన్ విద్యాసాగర్ నాయుడు, SIB ఎస్పీ- సుమిత్ సునీల్, 16వ బెటాలియన్ APSP విశాఖ కమాండెంట్-గౌతమి సాలి, 5వ బెటాలియన్ APSP విజయనగరం కమాండెంట్- రాహుల్‌దేవ్ శర్మ, 3వ బెటాలియన్ APSP కాకినాడ కమాండెంట్- CH విజయరావు, CID ఎస్పీ- V హర్షవర్ధన్ రాజు, CID ఎస్పీ-ఫకీరప్ప, విజయవాడ రైల్వే ఎస్పీ- రాహుల్‌దేవ్ సింగ్, ఆక్టోపస్ ఎస్పీ-సిద్ధార్థ కౌశల్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కర్ణాటక ఎన్నికల్లో.. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి కీలక బాధ్యతలు?



దిల్లీ: భాజపాలో చేరిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఇవాళ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిశారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో అమిత్ షాను కలిసిన ఆయన తాజా రాజకీయాలపై కొద్దిసేపు చర్చించారు. నడ్డా నివాసంలోనే పార్టీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్పను కూడా కలిశారు. ఇదే సమయంలో నడ్డా, అమిత్ షా, బీఎల్ సంతోష్, యడ్యూరప్ప, కర్ణాటక సీఎం బొమ్మై సమావేశమై కర్ణాటక ఎన్నికలపై చర్చించారు. వీరితో పాటు కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో అనుసరించాల్సిన వైఖరి, అభ్యర్థుల ఖరారు, ఇతర అంశాలపై చర్చించినట్టు సమాచారం. కర్ణాటక ఎన్నికలకు సంబంధించి కిరణ్ కుమార్‌రెడ్డికి పలు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ప్రధానంగా తెలుగు ఓటర్లను ఆకర్షించేందుకు బెంగళూరు కేంద్రంగా కిరణ్ కుమార్ రెడ్డి సేవలు వినియోగించుకోవాలని భాజపా అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధాన మంత్రి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రల్లో పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం దిల్లీ చేరుకున్న తర్వాత భాజపా పార్లమెంటరీ బోర్డు భేటీ కానుంది. కర్ణాటక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను పార్లమెంటరీ బోర్డు ఖరారు చేయనుంది. బోర్డు సమావేశానికి ముందే పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఈరోజు భేటీలో చర్చించిన అంశాలను తిరిగి బోర్డులో కూడా చర్చించిన తర్వాత భాజపా పెద్దలు ఆమోద ముద్ర వేయనున్నారు.

## చీరలో చందమామలా 'సార్' బ్యూటీ

యంగ్ బ్యూటీ సంయుక్త మీనన్ గ్లామర్ కి యువత ఫిదా అవుతున్నారనే చెప్పాలి. టాలీవుడ్ లో భీమ్లా నాయక్ చిత్రంతో ఈ అమ్మడు ఎంట్రీ ఇవ్వగా... ఇప్పుడు వరుస అవకాశాలతో దూసుకెళ్తోంది. మొదటి సినిమాలో రానా సరసన నటించి మెప్పించింది ఈ భామ. ఇక గత ఏడాది బింబిసార చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది ఈ మలయాళీ బ్యూటీ.... ఆ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన సార్ సినిమాలో నటించింది. ఇక సార్ సినిమాలో సంయుక్త అందాలకు నటనకు అందరూ ఫిదా అయ్యారనే చెప్పాలి. ఇక ఈ సినిమాతో హ్యాట్రిక్ హిట్స్ ను తన ఖాతాలో వేసుకుంది ఈ మలయాళీ బ్యూటీ. ఇక ఈ భామ హీరోల పాలిట అదృష్ట దేవతగా మారిపోయిందని అంతా అనుకున్నారు. తను నటిస్తున్న అన్ని సినిమాలు హిట్ అవుతున్నాయని.. ఫ్యాన్స్



ఖుషీ అవుతున్నారు. ఇక ఈ బ్యూటీ... గులాబీ పువ్వులాంటి గ్లామర్కి తోడుగా శారీ కట్టుకున్న ఈ కేరళ ముద్దుగుమ్మ.. పదహారణాల తెలుగమ్మాయిలా పోజులిచ్చింది. అమ్మడి లేటెస్ట్ ఫోటోలకు కుర్రాళు బాగా కనెక్ట్ అవుతున్నారు. సంయుక్త మీనన్ లేటెస్ట్ ఫోటోలు చూసి నెటిజన్లు గ్లామర్ క్వీన్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. లైక్లు హార్ట్ సింబల్స్ షేర్ చేస్తున్నారు. ఇక సంయుక్త మీనన్ నటిస్తున్న తాజా చిత్రం వీరూపాక్ష. ఈ చిత్రంలో సాయి ధరమ్ తేజ్ సరసన సంయుక్తా మీనన్ కథానాయికగా నటిస్తోంది. విరూపాక్ష' సినిమాకు కార్తీక్ వర్మ దండు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన సుకుమార్ శిష్యుడు. ఈ చిత్రానికి సుకుమార్ కథ కథనం అందించారు. సుకుమార్ రైటింగ్స్ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థలపై ఓ సినిమా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ పోస్టర్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఈ సినిమా కూడా సక్సెస్ అయితే ఈ కేరళ కుట్టికి తిరుగు లేదని అంటున్నారు. వరుస విజయాలు తన ఖాతాలో వేసుకుంటుంది అని భావిస్తున్నారు. చూడాలి ఇక ఈ సినిమా హిట్ అయితే తనకు ఎంత కలిసి వస్తోందనని.

## రోజు రోజుకు మరీ ఇంత క్యూట్ అవుతున్నారేంటి మేడం?

ప్రేమమ్ అనే సినిమా తో సౌత్ సినీ సిల్వర్ స్క్రీన్ పై ఎంట్రీ ఇచ్చి అనూహ్యంగా ఇండస్ట్రీలో స్టార్ డమ్ దక్కించుకున్న ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. హీరోయిన్ గా సుధీర్ఘ కాలం కెరీర్ లో సాగుతున్న ఈ అమ్మడు మెల్ల మెల్లగా పెద్ద సినిమాలకు దగ్గర అవుతుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు చేసిన సినిమాల ద్వారా కంటే కూడా ఎక్కువగా సోషల్ మీడియా ద్వారానే గుర్తింపు దక్కించుకుంది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా తెలుగు.. తమిళం మరియు మలయాళంలో సినిమాలు చేస్తున్న అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఏదో ఒక ఫోటో షూట్ ను ప్రేక్షకుల ముందుకు షూట్ చేస్తుంది. ఆ ఫోటో లకు ఆమె ఫాలోవర్స్ మరియు నెటిజన్స్ ఫిదా అవ్వాల్సిందే. క్యూట్ లుక్.. హాట్ లుక్.. ఫ్యామిలీ లుక్.. ఇలా ప్రతి ఒక్క లుక్ లో కూడా అరే భలే ఉ



ందే అంటూ అభిమానులు అనుకునేలా ఉంటుంది. తాజాగా ఈ ఫోటోలు షేర్ చేసిన అనుపమ పరమేశ్వరన్ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా ఈ అమ్మడు చేసిన సినిమాల్లో లుక్ కంటే ఇలా క్యూట్ గా హాట్ గా ఉన్నావు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందమైన అమ్మాయి అంటూ ప్రతి ఒక్కరితో ప్రశంసలు దక్కించుకున్న అనుపమ పరమేశ్వరన్ ఈ ఫోటోలతో మరోసారి సోషల్ మీడియాను షేక్ చేస్తుంది అనడంలో సందేహం లేదు. 2015 సంవత్సరంలో ప్రేమమ్ సినిమా తో ఇండస్ట్రీ లో అడుగు పెట్టిన అనుపమ తెలుగు లో మాత్రం కాస్త ఆలస్యంగా 2016 సంవత్సరంలో త్రివిక్రమ్ మూవీ 'అఆ' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో సెకండ్ హీరోయిన్ అయినా కూడా మంచి గుర్తింపును దక్కించుకుంది. అదే ఏడాది తెలుగు ప్రేమమ్ లో కూడా ఒక హీరోయిన్ గా నటించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈమధ్య కాలంలో కూడా వరుసగా సినిమాలను చేస్తూ వస్తుంది. తెలుగు లేదా తమిళం అని కాకుండా అంది వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్ ను కూడా ఈమె ఓకే చెప్పేస్తుంది. చివరకు ఒక షార్ట్ ఫిల్మ్ లో కూడా నటించి నటిగా మంచి మార్కులు దక్కించుకున్న విషయం తెల్సిందే. అనుపమ పరమేశ్వరన్ ఇప్పటికే నటించిన కార్తికేయ 2 మరియు 18 పేజెస్ సినిమా లు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. ఈ రెండు సినిమాల తర్వాత తెలుగులో ఈ అమ్మడు మరింతగా బిజీ అయ్యేనో చూడాలి.




## ఐఫోన్ సాంగ్ లిరికల్ వీడియో: మిక్కీ జె మాస బీట్.. గోపీ-డింపుల్ రొమాన్స్ కిరాకే




మాకో హీరో గోపీచంద్ 'రామ బాణం' ప్రమోషన్ కార్యక్రమాల్లో జోరు పెంచిన సంగతి తెలిసిందే. శ్రీవాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం యాక్షన్ అంశాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రూపొందుతోంది. క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్ కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా మొదటి సింగిల్ విడుదలైంది. 'ఐఫోన్....' అంటూ సాగే లిరికల్ వీడియో విడుదల కాగా అంతర్జాలంలో వైరల్ గా మారింది. మిక్కీ %జే% మేయర్ హై-స్పీడ్ బీట్ లతో కూడిన మాస్ డ్యూయెట్ ను అద్భుతంగా కంపోజ్ చేశారు. గాయనీగాయకుల అద్భుతమైన గాత్రాలు నాయకానాయికల అద్భుతమైన నృత్యాలు క్లాస్సి విజువల్స్ మాస్ ని మైమరిపిస్తున్నాయి. ఇలాంటి మాస్ పాటలు రాయడంలో స్పెషలిస్ట్ అయిన కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. తెలంగాణ యాసలో ఈ పాటను రాశారు. రామ్ మిరియాల- మోహన భోగరాజు గాత్రం అదనపు ఎనర్జీతో మైమరిపిస్తోంది. గోపీచంద్ - డింపుల్ హయాతి డ్యాన్సింగ్ విన్యాసాలు ఆకట్టుకోగా.. డింపుల్ నడుము ఊపుడు ఇలియానా బెల్లీ డ్యాన్స్ స్టైల్ ని గుర్తు చేసాయి. ఈ మాస్ యుగళగీతంలో కూల్ పెర్ఫామెన్స్ తో అందమైన జోడీ మెరిపించింది. గోపీ-డింపుల్ రాకింగ్ కెమిస్ట్రీ మాస్ కి కనెక్టయింది. గోపీచంద్ స్టైలిష్ అవతార్ లో కనిపించగా.. డింపుల్ సూపర్-హాట్ లుక్ తో కవ్వించింది. ఐఫోన్ .. సాంగ్ పూర్తిగా మాస్ ని ఉద్దేశించి తెరకెక్కించిన సాంగ్. జగపతి బాబు- ఖుష్బు ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడేకర్- నాజర్ అలీ రాజా రవీంద్ర- వెన్నెల కిషోర్- సప్తగిరి- కాశీ విశ్వనాథ్- సత్య- గెటప్ శ్రీను- సమీర్- తరుణ్ అరోరా తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. సమ్మర్ కానుకగా మే 5న రామబాణం విడుదలకు సిద్ధమవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించగా- వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా అత్యంత భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ చిత్రంలో గోపీచంద్ పూర్తి భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. భూపతి రాజా ఈ చిత్రానికి కథను అందించగా.. వెట్రి పళని స్వామి సినిమాటోగ్రఫీని.. మిక్కీ జె మేయర్ సంగీతాన్ని అందించారు. మధుసూదన్ పడమటి డైలాగ్స్ అందించగా... ప్రవీణ్ పూడి ఎడిటింగ్ వర్క్ అందిస్తున్నారు.

## బాంబ్ పేల్చడంలో జాన్వీ ఎక్స్ పర్ట్ క్వాలిటీ




ఎక్స్ ప్లోజివ్స్ పేల్చాలంటే స్పెషలిస్టుల్ని బరిలో దించాలి. కానీ ఇక్కడ అనుభవంతో పనే లేకుండా అలాంటి ఎక్స్ ప్లోజన్స్ కి కారణమవుతోంది ఈ అందాల నటవారసురాలు. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలు జాన్వీ కపూర్ గురించే ఇదంతా. బ్యాక్ టు బ్యాక్ .. రోజుకో గంటకో ఫోటోషూట్ తో విరుచుకుపడడం ఈ అమ్మడి ప్రత్యేకత. బికినీలు.. స్విమ్ సూట్లు .. డిజైనర్ సూట్ లు.. మ్యాగజైన్ కవర్ షూట్లు ఈ అమ్మడికి కొత్తేమీ కాదు. కానీ ఈసారి మరింత హాట్ గా ఫిలింఫేర్ మ్యాగజైన్ కవర్ పై దర్శనమిచ్చింది. సాటర్ డే సిజిల్స్ పేరుతో జాన్వీ షేర్ చేసిన ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలాన్ని ఒణికిస్తోంది. బ్లాక్ టాప్ పై బ్లూ లైనర్ తో కిక్కిస్తోంది జాన్వీ టాప్. దానికి కాంబినేషన్ ఫ్యాంట్ ని ధరించింది ఈ అందాల భరిణె. జాన్వీ ఒంపుసొంపుల వయ్యారం వడ్డనలు పీక్స్ అని చెప్పాలి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.వీడీతో దూసుకొస్తోందా? పూరి జగన్నాథ్ '%జీ+వీ%' కోసం యంగ్ ట్యాలెంటెడ్ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ని ఎంపిక చేసారని.. విజయ్ దేవరకొండకు జోడీగా నటిస్తుందని కథనాలొచ్చాయి. తన తాజా ఇంటర్వ్యూలో జాన్వీ ఈ ప్రాజెక్ట్ పై క్లారిటీ ఇచ్చింది. "ఊహాగానాలు నమ్మవద్దు. నేను ఇంకా ఏ తెలుగు లేదా తమిళ చిత్రానికి సైన్ చేయలేదు. నేను ఒక సంతకం చేస్తే.. నేను కానీ నా ప్రొడక్షన్ హౌస్ కానీ దానిని ధృవీకరిస్తాం" అని జాన్వి తెలిపింది. JGM లో నటిస్తున్నారా? అని తాజా ఇంటర్వ్యూలో అడగ్గా.. జాన్వీ పైవిధంగా బదులిచ్చారు. లైగర్ తర్వాత విజయ్ దేవరకొండ -పూరీ జగన్నాథ్ కాంబినేషన్ లో రూపొందనున్న సినిమా JGM. జనగనమణ అనేది టైటిల్ పూర్తి రూపం. నిజానికి ఈ ప్రాజెక్టులో మహేష్ లేదా పవన్ నటించాల్సి ఉండగా అట్నుంచి లైన్ క్లియర్ కాలేదు. దీంతో పూరి లైగర్ స్టార్ దేవరకొండతో వెంటనే ఈ ప్రాజెక్ట్ ని ప్రకటించాడు. పూరి- ఛార్మి వరుస పాన్ ఇండియా సినిమాల్ని నిర్మిస్తూ హీట్ పెంచేస్తున్నారు. బాలీవుడ్ లో జాన్వీ స్పీడ్ జాన్వీ బాలీవుడ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీ బిజీ. ప్రస్తుతం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రంతో మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవుతోంది జాన్వీ కపూర్. ఈ చిత్రంలో జాన్వీ పెళ్లయిన యువతిగా.. మహిళా క్రికెటర్ గా కనిపించనుంది. మిస్టర్ అండ్ మిసెస్ మహిలో జాన్వీ - రాజ్ కుమార్ వరుసగా మహేంద్ర -మహిమ అనే పాత్రలను పోషించనున్నారు. శరణ్ శర్మతో జాన్వీకి ఇది రెండో ప్రాజెక్ట్. జాన్వీ కపూర్ టైటిల్ రోల్ లో నటించిన 2020 చిత్రం 'గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్' శరణ్ కి దర్శకుడిగా రెండో సినిమా. భారతదేశంలో క్రికెట్ కు విపరీతమైన ఆదరణ ఉన్నందున ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలా ఆడుతుందో చూడాలన్న ఆసక్తిని పెంచుతోంది. జాన్వీ నటించిన దోస్తానా 2 .. గుడ్ లక్ జెర్రీ పైనా ఎంతో ఆసక్తి నెలకొంది. ఆమె చేతిలో మిల్లీ అనే మరో క్రేజీ సినిమా కూడా ఉంది.. ఒక నటిగా అండర్-ఎక్స్పోజ్డ్ ఫీలింగ్ గురించి కపూర్ గాళ్ థ్రిల్లింగ్ గా ఉన్నానని తెలిపింది. మిల్లీలో ఆమె తన తండ్రి నిర్మాత బోనీ కపూర్ తో కలిసి పని చేయడం ఆసక్తికరం. మరోవైపు విజయ్ దేవరకొండ శివనిర్వాణ- సమంతలతో కలిసి కశ్మీర్ నేపథ్యంలో ప్రేమకథా చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసినదే.

## రోజు రోజుకు పెంచేస్తున్న మృణాల్

సీతారామం సినిమా తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఆ సినిమా లో మృణాల్ ను చీర కట్టులో పద్దతైన లుక్ లో చూడటం జరిగింది. ఆ తర్వాత ఈమెను సోషల్ మీడియాలో హాట్ లుక్ లో చూసి తెలుగు ప్రేక్షకులు.. నెటిజన్స్ అవాక్కవుతూనే ఉన్నారు. మృణాల్ ఠాకూర్ సీతారామం సినిమాలో అంత పద్దతిగా కనిపించి ఇప్పుడు మరీ ఇంతగా స్కిన్ షో చేస్తోంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో సీతారామం బ్యూటీ యొక్క జోరు రోజు రోజుకు పెరుగుతూనే ఉ




ంది. ఆకట్టుకునే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం.. దానికి తోడు స్కిన్ షో చేస్తే ఈమె కు మరింతగా పాపులారిటీ పెరుగుతుంది. ఇటీవలే బీచ్ లో అందాల ఆరబోత చేస్తూ ఫొటోలు షేర్ చేసిన ఈ అమ్మడు తాజాగా మరో ఫొటో షూట్ తో రెచ్చి పోయింది. క్లోజప్ లో క్లీవేజ్ షో చేసి అలరించింది. కవ్వించే చూపులతో ఈ అమ్మడు షో చూపిస్తూ ఉన్నట్లుగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఇలాంటి ఫొటోలు ముందు ముందు మృణాల్ నుండి మరిన్ని రావాలని ఫ్యాన్స్ కోరుకుంటూ ఉన్నారు. ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే సీతారామం తర్వాత ఎట్టకేలకు నాని 30 సినిమా లో హీరోయిన్ గా నటించేందుకు గాను మృణాల్ ఠాకూర్ ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా విజయ్ దేవరకొండ హీరోగా నటించబోతున్న ఒక సినిమాలో కూడా మృణాల్ ఠాకూర్ నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది.

## అంతటి ఒంపులకు ఎంతటి వారైనా ఫిదా

ముకుందా ఒక లైలా కోసం సినిమాలతో సినిమాలతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు 2012 సంవత్సరంలోనే పరిచయం అయిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఆ సమయంలో ఈమెను జనాలు పెద్దగా పట్టించుకోలేదు. ఆ సినిమాలు విజయాన్ని సొంతం చేసుకున్నా కూడా ఈమెకు పెద్దగా గుర్తింపు అయితే రాలేదు. ఆ రెండు సినిమాల తర్వాత హిందీలో సినిమా ను చేసేందుకు రెండేళ్లు వెళ్లింది. డీజే సినిమా తో మళ్లీ 2017 సంవత్సరంలో తెలుగు లో ఎంట్రీ ఇచ్చింది. ముకుంద సినిమాలో కనిపించిన హీరోయిన్.. డీజే హీరోయిన్ ఒక్కరేనా అనే అనుమానం కలిగేంతగా ఈమెలో మార్పు కనిపించింది. మొదటి రెండు సినిమాలతో పోల్చితే మూడవ సినిమా పూర్తిగా మారింది. బికినీ వేయడంతో పాటు అందాల ఆరబోత విషయంలో పీక్స్ అన్నట్లుగా కనిపించింది. డీజే తర్వాత టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ గా ఈ అమ్మడు మారిపోయింది. 2017 సంవత్సరం నుండి ఇప్పటి వరకు అంటే అయిదు సంవత్సరాలుగా మోస్ట్ బిజీ హీరోయిన్ గా



ఈ అమ్మడు సినిమాలు చేస్తూనే ఉంది. హీరోయిన్ గా ఈమె ఒకానొక సమయంలో స్టార్ హీరోలకు సైతం డేట్లు లేకపోవడంతో నో చెప్పిన సందర్భాలు ఉన్నాయి. టాలీవుడ్ లో యంగ్ స్టార్ హీరోలందరితో కూడా సినిమా చేసిన ఘనత ఈ అమ్మడికి దక్కుతుంది అనడంలో కూడా ఎలాంటి సందేహం లేదు. హీరోయిన్ గా ఓ రేంజ్ లో దూసుకు పోతున్న పూజా హెగ్డే ఇలా అందాల ఆరబోత విషయంలో... సోషల్ మీడియాలో హాట్ ఫోటో షూట్స్ విషయంలో కూడా తగ్గేదే లే అన్నట్లుగా ఉంటుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు చేస్తున్న సినిమాలతో సమానంగా ఈ అమ్మడి ఫోటో షూట్స్ కూడా ఈమెకు గుర్తింపు తెచ్చి పెడుతున్నాయి. ఉత్తరాదిన కూడా ఈమెకు సినిమాల్లో ఆఫర్లు వస్తున్నాయి అంటే ఈ ఫోటో షూట్స్ వల్లే అంటున్నారు. హీరోయిన్ గా ఈ అమ్మడి స్టార్ డమ్ పెరిగినా కొద్ది ఇన్ స్టా లో ఈ అమ్మడి పాలోవర్స్ పెరుగుతూ మరింతగా పాపులారిటీని దక్కించుకుంటుంది. ఫాలోవర్స్ పెరిగే కొద్ది అందాల విందు పెరుగుతున్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇన్ స్టా లో 20 మిలియన్ ల ఫాలోవర్స్ కు ఈ అమ్మడు చేరువయ్యింది.




# సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలెక్కింది. సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడవనున్న ఈ సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం ప్రధాని నరేంద్రమోదీ 10వ నంబర్ ప్లాట్‌ఫాంపై జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు. ఈ రైలులో కొంతమంది విద్యార్థులు నల్గొండ వరకు ప్రయాణిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ప్రధాని.. నేరుగా వందేభారత్ రైలు ఎక్కారు. అక్కడ ఉన్న విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం జెండా ఊపి రైలును ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం చేర్యాల పెయింటింగ్‌ను రైల్వే శాఖ మంత్రి ప్రధానికి అందించారు. అంతకుముందు ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమర్ స్వాగతం పలికారు. బేగంపేట నుంచి ఎస్పీజీ దళాల ప్రత్యేక కాన్వాయ్ పర్యవేక్షణలో మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడిచే (20701) రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉదయం 6గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.30గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు స్టేషన్లలో ఆగుతుంది. అలాగే, తిరుపతి – సికింద్రాబాద్ (20702) రైలు తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరి రాత్రి 11.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మంగళవారం మినహా మిగిలిన రోజుల్లో ఈ రైలు సేవలందిస్తుంది. ఈ రైలులో టికెట్ల ధరలను పరిశీలిస్తే..

**సికింద్రాబాద్ నుంచి ఒక్కో స్టేషన్‌కు ఛార్జీలు ఇలా.. ఛైర్ కార్ –** సికింద్రాబాద్ నుంచి నల్గొండ – రూ.470, సికింద్రాబాద్ నుంచి గుంటూరు – రూ.865, సికింద్రాబాద్ నుంచి ఒంగోలు – రూ. 1075. సికింద్రాబాద్ నుంచి నెల్లూరు – రూ.1270, సికింద్రాబాద్ నుంచి తిరుపతి – రూ.1680, ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ ఛార్జీలు సికింద్రాబాద్ నుంచి నల్గొండ – రూ.900, సికింద్రాబాద్ నుంచి గుంటూరు – రూ.1620, సికింద్రాబాద్ నుంచి ఒంగోలు – రూ.2045, సికింద్రాబాద్ నుంచి నెల్లూరు – రూ.2455, సికింద్రాబాద్ నుంచి తిరుపతి – రూ.3080... ఈ ఛార్జీలకు టికెట్ బుకింగ్ కన్వీనియెన్స్ ఛార్జీలు అదనంగా ఉంటాయి.




హైదరాబాద్: సికింద్రాబాద్ – తిరుపతి మధ్య వందేభారత్ రైలును అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భాగ్యలక్ష్మి నగరాన్ని వేంకటేశ్వరస్వామి నగరంతో కలిపామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ – తిరుపతి మధ్య వందేభారత్ రైలును ప్రారంభించిన అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ప్రియమైన సోదర, సోదరీమణులారా.. అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలు పెట్టారు. "కరోనా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచం తిరోగమనంలోకి వెళ్లింది. భారత్ మాత్రం ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. బడ్జెట్‌లో ఈ ఏడాది మౌలిక వసతుల కల్పన కోసం రూ.10 లక్షల కోట్లు కేటాయించాం. రాష్ట్రంలో రూ.35 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాం. జాతీయ రహదారుల విస్తరణకు భారీగా నిధులు కేటాయించాం. రాష్ట్రంలో భారీ టెక్స్‌టైల్ పార్క్ నిర్మించుకున్నాం. టెక్స్‌టైల్ పార్క్‌తో రైతులు, కార్మికులకు ఎంతో ఉపయోగం. తొమ్మిదేళ్లలో భారత్ రూపురేఖలు సమూలంగా మార్చాం. దేశ అభివృద్ధిలో తెలంగాణ భాగమయ్యేలా చేశాం. రూ. 11 వేల కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నాం" అని మోదీ పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు :** "హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్ సేవలు విస్తరిస్తున్నాం. ఒక్కరోజే 13 ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాం. సికింద్రాబాద్ – మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ పనులు పూర్తి చేశాం. తెలంగాణలో హైవే నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్ – బెంగళూరు అనుసంధానాన్ని మెరుగుపరుస్తున్నాం. తెలంగాణలో జాతీయ రహదారుల విస్తీర్ణాన్ని భారీగా పెంచుతున్నాం. తెలంగాణలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు. కేంద్రం ప్రగతి పనులు చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం బాధపడుతోంది. తెలంగాణలో 12 లక్షల మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. తెలంగాణ అభివృద్ధి కోసం మమ్మల్ని ఆశీర్వదించాలి.

**కుటుంబ పాలన కారణంగా అవినీతి పెరుగుతోంది :** రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి రాజ్యమేలుతున్నాయి. తండ్రి, కొడుకు, కుమార్తె.. అంతా అధికారంలో ఉంటారు. కుటుంబ పాలన కారణంగా అవినీతి పెరుగుతోంది. కుటుంబ పాలన, అవినీతి వేర్వేరు కాదు. కొంత మంది ప్రగతి నిరోధకులుగా మారారు.

ప్రజల సొమ్ము అవినీతిపరులకు చేరకుండా చర్యలు తీసుకుంటున్నాం. నేరుగా రైతులు, విద్యార్థుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నాం. డిజిటల్ విధానం ద్వారా దళారీ విధానం లేకుండా చేశాం. నిజాయితీతో పనిచేసే వారంటే అవినీతిపరులకు భయం. అభివృద్ధి పనుల్లో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి రావడం లేదు. దేశాన్ని అవినీతి నుంచి విముక్తి చేయాలా వద్దా? అవినీతిపై పోరాటం చేయాలా? వద్దా? అవినీతిపరుల విషయంలో చట్టం తనపని తాను చేసుకోవాలా? వద్దా?.. కుటుంబ పాలన నుంచి ఈ ప్రజలకు విముక్తి కలిగిస్తాం" అని ప్రధాని మోదీ వెల్లడించారు.

# ఉపాధి హామీపై పోస్టు కార్డుల ఉద్యమం ప్రారంభం..

## మొదటి పోస్ట్ కార్డు రాసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



నర్సంపేట : ఉపాధి హామీ పథకంపై పోస్టు కార్డుల ఉద్యమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలం మహమ్మదాపురం నుంచి ప్రారంభించారు. మొదటి పోస్ట్ కార్డును కేంద్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రికి పంపించారు. రెండో పోస్ట్ కార్డును నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పంపించారు. ఈ సందర్భంగా ఆ పోస్ట్ కార్డుపై ఈ విధంగా రాశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రం చూస్తోంది. గత ఏడాది రూ. 30 వేల కోట్ల బడ్జెట్ కోత విధించారు. దీంతో ఉపాధి కూలీలకు పని దినాలు తగ్గాయి. వ్యవసాయ కూలీకి రోజుకు రూ. 257 ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ, ఒక్కో కూలీకి రూ. వందకు మించడం లేదు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు టెంటు, మంచినీరు, గడ్డపారలు, పారలు, తట్టలు వంటివి అందించడం లేదు. కనీస వేతన చట్ట ప్రకారం 8 గంటలు పని చేసిన కూలీకి రూ. 480 ఇవ్వాలని ఉన్నప్పటికీ, ఉపాధి హామీ కూలీలకు మాత్రం కనీస కూలీ గిట్టడం లేదు. ఆన్‌లైన్ పద్ధతి వల్ల గ్రామీణ అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పాటించలేకపోతున్నారు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కూలీలుగా వారే ఉంటున్నారు. కాబట్టి వ్యవసాయం అనుసంధానం చేయటం వల్ల రైతులకు కూలి గిట్టుబాటు అవుతుంది. ప్రతి ఎకరాకు నిర్ణీత టోకెన్లు, కనీసం 100 పనిదినాలు కల్పించాలి. అలాగే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి. ఫీల్డ్ అసిస్టెంట్లు మొదలు ఏ పి ఓ ల వరకు ఉపాధి ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి అని ఆ పోస్టు కార్డులో రాశారు.

# వందే భారత్ రైళ్లు చాలా వీక్.. బర్రెలు దయచేసి అటు వెళ్లకండి..

*మోదీ పర్యటన నేపథ్యంలో టీఎస్ రెడ్కో చైర్మన్ సతీశ్ రెడ్డి వినూత్న నిరసన*

హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనపై, వందే భారత్ రైలు ప్రారంభోత్సవంపై టీఎస్ రెడ్కో చైర్మన్ వై సతీశ్ రెడ్డి వినూత్నంగా నిరసన తెలిపారు. వందే భారత్ రైలు ప్రారంభమయ్యాక ఇప్పటివరకు దాదాపు 68 వరకు ప్రమాదాలు జరిగాయి. బర్రెలు, ఆవులను ఢీకొని వందే భారత్ రైలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సతీశ్ రెడ్డి.. బర్రెలకు విజ్ఞప్తి చేశారు. 'మోదీ సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైలును ప్రారంభిస్తున్నారు. వందే భారత్ రైళ్లు చాలా వీక్‌గా ఉంటాయి. దయచేసి అటువైపు వెళ్లొద్దు. మీరు పొరపాటున తాకినా రైలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దేశంలో బుల్లెట్ రైలు పరుగులు పెట్టిస్తానని చెప్పిన మోదీ.. వందే భారత్ పేరుతో బర్రెలు, ఆవులు తాకితేనే చిద్రమైపోయే రైళ్లను తీసుకొచ్చారు. అలాంటి రైళ్లతో వాటికే కాదు మీకూ ప్రమాదమే. వాటిని ప్రారంభించడం ఎలాగూ మోదీ ఆపేపరిస్థితి కనిపించడం లేదు. కాబట్టి మీరైనా అటువైపు వెళ్లకుండా ఉండి ప్రాణాలు కాపాడుకోండి. బంధుమిత్రులకు చెప్పి వందే భారత రైలు ప్రయాణించే ట్రాక్ వైపు వెళ్లకుండా చూడండి' అంటూ బర్రెలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క వందే భారత్ పథకాన్ని ప్రధాని మోదీ ఎన్నిసార్లు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇప్పటివరకు దాదాపు 17 సార్లు అంటే 17 రైళ్లను ప్రధాని స్వయంగా ప్రారంభించారని చెప్పారు. రైల్వే శాఖ మంత్రి చేయాల్సిన పనిని దేశ ప్రధాని చేయడం సిగ్గుచేటన్నారు. పబ్లిసిటీ పిచ్చితో కేవలం ప్రారంభోత్సవాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ డబ్బుతో మరేదైనా కొత్త ప్రాజెక్టు కట్టే అవకాశం ఉందన్నారు. అవసరమైతే రైలు కనెక్టివిటీ లేని ప్రాంతానికి కొత్తగా లైన్ వేసే అవకాశం కూడా ఉందని చెప్పారు.

# ప్రకృతి వైద్యానికి కేరాఫ్‌గా తెలంగాణ: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: ప్రకృతి వైద్యానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా కృషి చేయాలని సీఎం కేసీఆర్ చెప్పారని మంత్రి హరీశ్ రావు అన్నారు. సనాతన భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా పనిచేస్తున్నదని వెల్లడించారు. హెల్త్‌హబ్ అయిన హైదరాబాద్‌లో చికిత్స పొందేందుకు దేశ విదేశాల నుంచి ఇక్కడికి పేషెంట్లు వస్తుంటారని, ఆయుష్ వైద్యం పొందేందుకు సైతం వచ్చేలా నేచర్ క్యూర్ దవాఖాన ఎదుగాలన్నారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని నేచర్‌క్యూర్ దవాఖానలో రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు, అభివృద్ధి పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రూ.10 కోట్లతో ఈ దవాఖానను అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఇంకా మరిన్ని నిధులు ఇస్తామన్నారు. కొత్తగా అభివృద్ధి చేసుకున్న ఈ హాస్పిటల్‌ను ప్రారంభించుకోడం సంతోషంగా ఉందని చెప్పారు. 'ప్రకృతితో వైద్యం, పంచ భూతాలతో వైద్యం.. అదే ప్రకృతి వైద్యం. అదే నేచురోపతి. ఇది పూర్తి భారతీయ వైద్య సిద్ధాంతం. ఆయుర్వేదం, నేచురోపతి, యోగా, హోమియోపతి, యునాని, సిద్ధ అని ఉంటాయి. ఇక్కడ నేచురోపతి, యోగా విధానాలు అందిస్తున్నారు. నేచురోపతి అనేది పూర్తిగా డ్రగ్ లెస్ హీలింగ్ సిస్టం. ఔషధ రూపంలో ఆహారాన్ని, యోగా, ప్రాణాయామంను శరీరానికి అందించడం ప్రత్యేకం. శరీరాన్ని డిటాక్సిఫికేషన్ చేయడం నేచర్ క్యూర్ విధానం. ఆయుష్ వైద్యంలో నేచురోపతికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్తి నేచురల్ పద్ధతిలో దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తారు. డయాబెటిస్, బీపీ, ఆర్థరైటిస్, మోకాళ్ల నొప్పులు, పీసీఓడీ, నడుం నొప్పులు, పెరాలసిస్, సయాటిక, అధిక బరువు, థైరాయిడ్, డిస్క్ సమస్యలు, సోరియాసిస్ ఇలా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు సైతం చికిత్స ఉంటుంది. సౌర చికిత్స, ఫిజియోథెరపీ, జల చికిత్స, మర్దన చికిత్స, మట్టి చికిత్స ఇలాంటివి చాలా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడి, లైఫ్ స్టయిల్ డిసీజెస్, ఇతర ఆరోగ్య సమస్యలతో సతమతవుతున్న వారికి నేచర్ క్యూర్ దవాఖాన స్వాగతం పలుకుతున్నది. ఒక విహార ప్రాంతానికి వచ్చినట్లు ఇక్కడికి వచ్చి మంచి ప్రకృతి చికిత్స పొందవచ్చు. ఏ నొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా తక్షణ ఉపశమనం కోసం వైద్యుల సలహా తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మందులు వాడుతుంటారు. అయితే దీని వల్ల అనేక సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. కానీ నేచర్ క్యూర్ చికిత్సలో అలాంటి మాట వినిపించదు. ఇన్ పేషెంట్‌గా ఉన్నవారికి సైతం మంచి భోజనం అందిస్తారు. వారి రోగాలకు సంబంధించిన చికిత్సలో భాగంగా ప్రత్యేక ఆహారం అందిస్తారు. పూర్తి హైజీన్‌తో, నూనెలు, మసాలాలు, ఉప్పు, కారాలు లేకుండా ఉంటుంది. జ్యూస్, సలాడ్ వంటివి సమయానికి అందిస్తారు. బరువు తగ్గాలనుకున్న వారికి, ఇతర రోగాలున్న వారికి పత్యేకంగా లిక్విడ్ డైట్ సైతం అందిస్తారు. 1949 స్థాపించిన ఈ ప్రకృతి చికిత్సాలయం, ప్రకృతి వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా ఉంది. దీనికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాలలో చదువుకున్న వారు దేశంలోని ప్రసిద్ధ ప్రకృతి చికిత్సాలయాల్లో పని చేస్తుండటం మనకు గర్వకారణం. అయితే ఘన చరిత్ర గల ఈ దవాఖానను ఉమ్మడి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా నిర్వీర్యం చేశారు. వైద్య రంగంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ.. ఆయుష్ చికిత్సల్లో కూడా అగ్రభాగాన ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన. ప్రకృతి వైద్యం కోసం ఎంతో మంది ప్రైవేటుకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. అలాంటి వారికి అతి తక్కువ ఖర్చుకే ఉత్తమ వైద్యం అందించేందుకు నేచర్ క్యూర్ దవాఖాన సిద్ధంగా ఉంది. హెల్త్‌హబ్ హైదరాబాద్‌లో చికిత్స పొందేందుకు దేశ విదేశాల నుంచి ఇక్కడికి పేషెంట్లు వస్తుంటారు. ఆయుష్ వైద్యం పొందేందుకు సైతం ఇక్కడి వచ్చేలా ఎదుగాలని కోరుతున్నా' అని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రకృతి వైద్యానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిపేలా ప్రయత్నం చేస్తున్నామని, సనాతన భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయి. వికారాబాద్, భూపాలపల్లి, సిద్ధిపేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని వెల్లడించారు.

**ఉమ్మడి రాష్ట్రంలో ఆదరణకు నోచుకోని నేచర్ క్యూర్: స్పీకర్ పోచారం –** 1949లోనే ఈ దవాఖానను ఏర్పాటు చేశారని, అయితే ఆదరణకు నోచుకోక, నాటి ప్రభుత్వాలు పట్టించుకోక పేషెంట్లు ఇబ్బంది పడేవారని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి హరీశ్ రావు ఈ హాస్పిటల్‌ను అద్భుతంగా తీర్చదిద్దారని, ప్రైవేటుకు ధీటుగా దీనిని అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలను బాగా అభివృద్ధి చేశారని వెల్లడించారు. ఏదైనా రోగం వస్తే వందలో 80 మంది సర్కారు దవాఖానకే వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు 62 శాతం పెరిగాయని స్పీకర్ పోచారం అన్నారు.

# మోదీ హటావో.. సింగరేణి బచావో.. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల మహాధర్నా



పెద్దపల్లి: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు మహాధర్నా చేపట్టాయి. ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మోదీ హటావో సింగరేణి బచావో అంటూ నినాదాలు చేస్తున్నారు. రాష్ట్రంపై ప్రధాని సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు మహాధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేస్తున్నారు. భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల, గోదావరిఖని, రామగుండం, మందమర్రి, నస్పూర్, ఇల్లందులో ధర్నాకు దిగారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో టీబీజీకేఎస్ నేత కెంగర్ల మల్లయ్య ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్‌లపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొగ్గుగనుల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కాగా, బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భూపాలపల్లిలో నిర్వహించనున్న ధర్నాలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం యత్నిస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. పేదల పొట్టకొట్టి పెద్దలకు పంచడమే మోదీ విధానమని విమర్శించారు. సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులతో కలిసి కొత్తగూడెంలో బీఆర్ఎస్ మహాధర్నా నిర్వహించింది. ఇందులో మంత్రి పువ్వాడ అజయ్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వనమా, సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కందాల ఉపేందర్ రెడ్డి, రాములు నాయక్ ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. మోదీ హటావో.. సింగరేణి బచావో అంటూ కార్మికులు నినదించారు. పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని చౌరస్తాలో నిర్వహించిన మహాధర్నాలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వని మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలుపుకోని మోదీకి తెలంగాణలో తిరిగే హక్కు లేదని నినాదాలు చేశారు. మంచిర్యాలలోని నస్పూర్ చౌరస్తాలో సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ సంఘం నేతలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఇందులో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి...

హైదరాబాద్: ప్రతి కుటుంబం వెంకటేశ్వరస్వామి దర్శనం కోరుకుంటుందని, శ్రీవారి భక్తుల కోసమే వందేభారత్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్–తిరుపతి



మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారన్నారు. దేశంలో 14వ వందేభారత్ రైలును ప్రారంభించుకున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతోందన్నారు. రూ.7864 కోట్లతో జాతీయ రహదారుల పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధానం జరుగుతోందని, ఎలాంటి భేదభావాలు లేకుండా ప్రధాని అభివృద్ధి చేస్తున్నారన్నారు. రూ.1,350 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్‌లో కొత్త భవనం నిర్మాణం చేస్తున్నామని, తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేది ప్రధాని మోదీ సంకల్పమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాబోయే 8 నెలలు అవిశ్రాంతంగా పని చేయాలి...

హైదరాబాద్: గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 8 నెలల పాటు అవిశ్రాంతంగా పని చేయాలని, ఇది చాలా కీలకమైన సమయమని అన్నారు. నాయకులు,




వారికి కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా పని చేయాలని సూచించారు. ప్రసార మాధ్యమాలలో మన వాదన బలంగా వినిపించేందుకు ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు.. ఎవరు ఎవరి కోసం పని చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. పని విభజన చేసామని.. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం చాలా కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ , ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, నదీమ్ జావిద్ పాల్గొన్నారు.

# కేంద్రం ఏం అభివృద్ధి చేస్తోందని అడ్డుకుంటున్నాం?: మంత్రి తలసాని

హైదరాబాద్: సికింద్రాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో భారాస ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ స్పందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. "తెలంగాణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇవాళ మాట్లాడారు. అసలు తెలంగాణలో కేంద్రం ఏం అభివృద్ధి పనులను చేస్తుంది? మేమేం అడ్డుకుంటున్నామో చెప్పాల్సిన అవసరం ఉంది. గతంలో కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇలాగే మాట్లాడారు. రాష్ట్రానికి రెండు మెడికల్ కాలేజీలు ఇస్తామంటే కళాశాలలున్న ప్రాంతంలోనే అడుగుతున్నామని చెప్పారు. మరి మెడికల్ కాలేజీలు లేని కొత్త ప్రదేశంలో నిర్మించవచ్చు కదా. ఊరికే బట్టకాల్చి మీద వేయాలని కేంద్రం చూస్తోంది. వాటన్నింటిని పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటును అందించాలి" అని తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

**కరెంట్‌పై బహిరంగ చర్చకు మోదీ సిద్ధమా?** "భారత్ బయోటెక్‌కు ప్రధాని వచ్చినప్పుడు సీఎం కేసీఆర్‌ను ఎందుకు పిలవలేదు. అక్కడి నుంచే కదా ప్రధాని–సీఎం మధ్య దూరం పెరిగింది. తెలంగాణలో అభివృద్ధి జరగకపోతే ఇన్ని అవార్డులు ఎందుకు ఇస్తున్నారు? రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తోంది. ఇక్కడ అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. 24 గంటలు కరెంట్ ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఈ అంశంపై ప్రధాని మోదీ బహిరంగ చర్చకు సిద్ధమా? రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి రాజ్యమేలుతున్నాయని మోదీ అంటున్నారు. మరి భాజపాలో కుటుంబ పాలన లేదా? కర్ణాటకలో అవినీతిపై ప్రధాని ఎందుకు మాట్లాడరు?" అని తలసాని ప్రశ్నించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com